నేడు TELUGU DAILY

# విలేకరులు కావలెను

అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.

9346984911
9133445456



సంచలన వార్తలకు

# నేడు

TELUGU DAILY

గురువారం | 19.06.2025 | సంపుటి : 3 | సంచిక :53 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




కూలిన విమానానికి మూడు నెలల క్రితమే కొత్త ఇంజన్.. 08



03

## మావోలకు మరో ఎదురుదెబ్బ

- రంపచోడవరం ఎన్‌కౌంటర్.. ముగ్గురు మృతి



## నా ఫోన్ ట్యాపింగ్ నిజం 03

### విచారణకు ఎక్కడికైనా వస్తా

- మీడియాతో వైసిసి చీఫ్ వైఎస్ షర్మిల


## గోదావరి వృధా జలాలను వాడుకోవాల్సిందే

### ఆనాడు కేసీఆర్ అభిప్రాయం కూడా ఇదే

- బనకచర్లకు తరలించాలన్న ప్రతిపాదన సమ్మతం కాదు
- బిసి రిజర్వేషన్ల కోసం 17న రైల్‌రోకో : ఎమ్మెల్సీ కవిత వెల్లడి

03





## కరోనా తాజా వ్యాప్తికి..

### ఆ నాలుగు సబ్-వేరియంట్లే కారణం 04

దేశవ్యాప్తంగా ఇటీవల మళ్లీ కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న విషయం తెలిసిందే. తాజా పెరుగుదలకు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు ఉపరకాలే కారణమని పుణె లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ వెల్లడించింది. జీనోమ్ సీక్వెన్సింగ్‌లో ఈ కొత్త ఉపరకాలను గుర్తించినట్లు పేర్కొంది. వ్యాక్సిన్‌ల సామర్థ్యాలను అంచనా వేయడంలో తాజా ఫలితాలు దోహదం చేస్తాయని తెలిపింది.



## మూడో విడత రైతు భరోసా విడుదల

- నాలుగు ఎకరాల వరకు.. రూ.1,313.53 కోట్లు జమ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

02

## భారత్-పాక్ ఒప్పందంలో

# మీ ప్రమేయం లేదు

- పాక్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం
- ట్రంప్‌తో మోదీ స్పష్టం

10

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తామే ఆపామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పదేపదే చాటుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర చర్చే నడిచింది. ట్రంప్ ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేశాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా దీనిపై స్పందించారు. భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని తేల్చి చెప్పారు.



## నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

- టెహ్రాన్ హద్దులు దాటింది
- దీనిపై స్పందించడం ఇప్పటికే ఆలస్యమైంది
- అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి
- ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

04





06

### శుభాంశు శుక్లా

## అంతరిక్ష యాత్ర మళ్లీ వాయిదా

- ఫాల్కన్-9 రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్
- 22కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన అధికారులు



04

## 'ఆపరేషన్ సింధు' షురూ...

- భారత విదేశాంగ శాఖ ప్రకటన
- ఆర్మేనియా నుంచి విద్యార్థులను భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు



07

## వాహనదారులకు గుడ్‌న్యూస్

ఫాస్టాగ్ వార్షిక పాస్ ప్రకటించిన కేంద్రం

### ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా

## బనకచర్లపై నిర్ణయం

- ఈ మేరకు జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, కిషన్‌రెడ్డి వెల్లడి



దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా నిర్ణయం తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ అంశంపై బుధవారం సాయంత్రం దిల్లీలో సీఆర్ పాటిల్‌తో కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టును జలశక్తి మంత్రిత్వశాఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని, అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించాకే పారదర్శక పద్ధతిలో నిర్ణయం ఉంటుందని సీఆర్ పాటిల్ చెప్పారని పేర్కొన్నారు.

మిగతా 2 లో

## కేసీఆర్ హయాంలోనే బనకచర్లకు బీజం



- జగన్‌తో భేటీలోనూ నీటి తరలింపును ప్రోత్సహించారు
- రాయలసీమను రతనాలసీమగా చేస్తానంటూ పెద్దన్నగా సహకరిస్తానంటూ హామీనిచ్చారు
- ఏపీ ప్రయత్నాలపై మేం తక్షణం అప్రమత్తమయ్యాం
- రాష్ట్ర ప్రయోజనాల కోసం న్యాయ, రాజకీయ పోరాటం
- అందరం వెళ్లి ప్రధానినీ కలుస్తాం
- గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీల వినియోగానికి చంద్రబాబు తెలంగాణకు ఎన్‌వోసీ ఇవ్వాలి
- అలా చేస్తే ఏపీలో ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోవచ్చు
- అఖిలపక్ష భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

### 2016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో ఆయన వ్యాఖ్యలతోనే బీజం

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పాపానికి పునాది వేసిందే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని.. రాష్ట్రానికి ఆయన తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుపై చర్చించేందుకు బుధవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలోని అన్ని పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్.. భేటీ ముగిశాక సచివాలయంలోనే ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

హైదరాబాద్, జూన్ 18 :

గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం, తీరని ద్రోహం జరిగితే.. ఆ విషయంలో శిక్షించి, ఉరి తీయాల్సింది కేసీఆర్, హరీశ్‌రావునే నని ధ్వజమెత్తారు. వారు ఏనాడూ తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేయలేదని.. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి, కుట్రలు చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టుల విషయంలో సర్వపాపాలు చేసి, పాపాల భైరవులుగా మారి రాష్ట్రానికి అన్యాయం చేశారని దుయ్యబట్టారు. వారే ఇప్పుడు.. 'బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మాట్లాడట్లేదు' అంటూ తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి ఏపీ శాసనసభలో సీఎం చంద్రబాబు మాట్లాడిన వెంటనే తాము కేంద్ర మంత్రిని కలిసి.. ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంతో పాటు అన్ని వివరాలనూ తెలిపామని సీఎం చెప్పారు.

మిగతా 2 లో

## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

- జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్
- డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని వెల్లడి

02

### కేసీఆర్ దత్తత గ్రామంలో అర్హులందరికీ

## ఇందిరమ్మ ఇళ్లు

### నేడు మంజూరు పత్రాల పంపిణీ : మంత్రి పొంగులేటి

కేసీఆర్ దత్తత గ్రామమైన వాసాలమర్రిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, వారికి గురువారం మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. యాదాద్రి జిల్లా వాసాలమర్రిలో ఇళ్ల నిర్మాణం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



02



03

## బనకచర్లతో వచ్చే నష్టమేమిటో?

మంత్రి ఉత్తమ్‌కు ఎంపి అర్వింద్ సూటిప్రశ్న

### తప్పుదోవ పట్టించేలా

## సీఎం అబద్ధాలు

- ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎజెండా 5లోని అంశాలు కావాలనే దాచారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

హైదరాబాద్: ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎజెండా 5లోని అంశాలు దాచి పెట్టి, ఎజెండా 1 అంశాలను మాత్రమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు.

మిగతా 2 లో






# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

- జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్
- డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని వెల్లడి
- తెలంగాణ రైజింగ్‌లో గూగుల్ తోడ్పాటు అవసరమన్న సిఎం

**హైదరాబాద్, జూన్ 18 :** ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందని ఈ సందర్భంగా అన్నారు.. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారాలన్న లక్షయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నాం అన్నారు. ఇక్కడి మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారు. ప్రభుత్వంలో నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చాం'అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

### గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రపంచంలో ఐదవది మాత్రమే అని తెలిపారు. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయిం దని.. నేడు మన జీవితాలు పూర్తిగా డిజిటల్‌గా మారాయన్నారు. గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామని తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్‌గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతామని చెప్పుకొచ్చారు. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగి స్తున్నందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందన్నారు. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతమని.. ఈ విధానాన్ని తాను ఇష్టపడుతున్నట్లు తెలిపారు. గూగుల్‌లా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నానన్నారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయని.. అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టిపెట్టి పనిచేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడికి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుందన్నారు.

### 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి

సెర్చ్‌లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుందని సీఎం రేవంత్ అన్నారు. దీనిని తెలంగాణ రైజింగ్ అని పిలుస్తామని... 2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. గూగుల్ ఆఫీస్ పక్కన రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశామని.. రైతులను సంపన్నులుగా తయారు చేయడంతో పాటు సంతోషంగా ఉంచాలను కుంటున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అందుకు గూగుల్ మద్దతు కావాలని.. తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా కావాలని కోరుకుంటున్నామన్నారు. గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులన్నారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నా రన్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర యువతకు లభించే అవకాశముంది. ఐటీ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకుపోతుందన్నది ఈ అభివృద్ధి సంకేతం.

# మూడో విడత రైతుభరోసా నిధుల విడుదల

**హైదరాబాద్:** రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద మూడో విడత నిధులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. నాలుగు ఎకరాల వరకు.. 6.33 లక్షల మంది రైతులకు 21.89 లక్షల ఎకరాల కోసం రూ.1,313.53 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మొత్తం రూ.5,215.26 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసి.. 58.04 లక్షల మంది రైతులకు సహాయం అందించినట్లు చెప్పారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం ఇచ్చిన హామీ మేరకు మరో వారంలోగా రైతుభరోసా నిధుల జమ పూర్తిచేస్తామన్నారు. రైతుభరోసాపై భారాస నాయకులకు తమను ప్రశ్నించే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో పనిచేసే దాడ్వాయిల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర దాడ్వాయిల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రవికుమార్, వీరన్న తదితరులు మంత్రిని గాంధీభవన్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

# తప్పుదోవ పట్టించేలా సీఎం అబద్ధాలు

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీల సమావేశంలో, మీడియా సమావేశంలోనూ సీఎం తన అబద్ధాల ప్రవాహాన్ని యథేచ్ఛగా కొనసాగించారని బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. "బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్‌రెడ్డి సిద్ధహస్తులని మరోసారి రుజువైంది. ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కేసీఆర్ చెప్పిన వాటిని ముఖ్యమంత్రి వక్రీకరించారు. రాజకీయ లబ్ధి పొందాలనే వక్ర బుద్ధే తప్పు.. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన రేవంత్‌కు లేదు. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదని కేసీఆర్ ఎజెండా 5లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం సీఎం అసత్యాలను ప్రజల ముందు ఉంచారు. మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అబద్ధాల పునాదుల మీద జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరు" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే బనకచర్లకు బీజం

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రితోనూ చర్చించామని.. ఇప్పటికే ఈ విషయంలో కేంద్ర జల్‌శక్తి మంత్రికి రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ లేఖలు రాశారని గుర్తుచేశారు. అఖిల పక్ష సమావేశం నిర్వహించడం వెనుక రాజకీయ ప్రేరేపిత అంశాలేవీ లేవన్న సీఎం.. భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికలపై ప్రతిపక్షాలను సూచనలు అడిగి నట్టు తెలిపారు. రాజకీయ అంశాలకు అవకాశం ఇవ్వకూడదని భావించే.. ఈ భేటీకి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఎంఐఎం, బీఆర్ఎస్ పార్లమెంటు సభ్యులను ఆహ్వానించామన్నారు.

### కేసీఆర్ చేసిన ద్రోహాలతోనే..

"భారాస నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో మరోలా మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. 21.09. 2016న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతితో పాటు.. తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, చంద్రబాబు.. మంత్రులుగా దేవినేని ఉమా, హరీశ్‌రావు పాల్గొన్నారు. గోదావరి, కృష్ణా నదీ జలాల వినియోగంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఎనిమిది పేజీల మీటింగ్ మినిట్లు ఉన్నాయి. ఆ సందర్భంలో కేసీఆర్.. "గోదావరి నుంచి మూడు వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీల నీళ్లు అవసరం. గోదావరి నుంచి కృష్ణాకు నీళ్లు తరలించి ఉపయోగించవచ్చు" అని సూచించారు. అలా కేసీఆర్ వైఖరితో తెలంగాణకు జరగబోయే నష్టానికి పునాదిరాయి ఆనాడే పడింది. గోదావరి నుంచి రాయలసీమకు నీళ్లు ఇవ్వవచ్చని అన్నారు. ఈ మీటింగ్ మినిట్స్ హరీశ్‌రావుకు పంపిస్తా. కేసీఆర్, ఏపీ నాటి సీఎం జగన్ మధ్య ప్రగతిభవన్‌లో నాలుగు సమావేశాలు జరిగాయి. వారిద్దరూ కూర్చుని గోదావరి జలాల్ని రాయలసీమకు తరలించాలని నిర్ణయించారు. సీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తానని కేసీఆర్ ఆనాడే జగన్‌కు హామీ ఇచ్చారు. ఆనాడు కేసీఆర్, జగన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారమే చంద్రబాబు ఇప్పుడు ముందుకు వెళుతున్నారు. ఇవాళ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభిస్తామని చంద్రబాబు అనగానే.. భారాస వ్యతిరేకిస్తోంది. గోదావరి-బనకచర్లను కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. నేను భారాసను, కేసీఆర్‌ను అడుగుతున్నా.. 2016లో, వివిధ సందర్భాల్లో, శాసనసభలో.. గోదావరి జలాల్ని రాయలసీమకు.. అదే విధంగా పెన్నా బేసిన్‌కు తరలించడాన్ని మీరు ఆమోదించారు. ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించడానికి అవకాశం కల్పించారు. ఈ రోజు బనకచర్లను ప్రారంభిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్న మరుక్షణం.. నేను, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లి జలశక్తి మంత్రిని కలిసి ఫిర్యాదు చేశాం. ఇతర కేంద్ర మంత్రులకూ ఫిర్యాదు చేశాం. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు దృష్టికీ తీసుకెళ్లాం. ఏపీ ప్రభుత్వం, ఏపీ సీఎం.. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాల్ని తరలించేందుకు ప్రణాళిక రూపొందించారని చెప్పాం. పరోక్షంగా మరో 100.. మొత్తం 300 టీఎంసీల తరలింపునకు సివిల్ పనులు చేస్తున్నారు. కాలువలు, సొరంగాలు, రిజర్వాయర్లు.. 300 టీఎంసీల కోసం నిర్మించేలా ప్రణాళిక వేశారు. ఆనాడు కేసీఆర్ 400 టీఎంసీల తరలింపునకు ప్రతిపాదన ఇచ్చారు. రాయలసీమ, పెన్నా బేసిన్లకు తరలించవచ్చని కేసీఆర్ సూచించారు.

### మేం ప్రాజెక్టులు కట్టకుండా మిగులు జలాలెక్కడ?

చంద్రబాబుకు సూచనలు చేస్తున్నా.. గోదావరిలో మూడు వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే.. గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీల నీటి కేటాయింపులున్నాయి. ఆ నీటికి బ్లాంకెట్‌గా ఎన్ఓసీ మీరు ఇవ్వండి. తెలంగాణలో 968 టీఎంసీలకు ప్రాజెక్టులు కట్టుకున్నాక.. కిందికి వెళితే అవి వరదజలాలు అవుతాయి. కేసీఆర్ తెలంగాణకు చేసిన ద్రోహం వల్ల మిగులు జలాలు ఏపీకి వరదగా వెళుతున్నాయి. మేడిగడ్డ కూలింది.. అన్నారం అక్కరకు రాలేదు.. అవి సక్రమంగా ఉండి ఉంటే.. నీళ్లు మేం ఎత్తిపోసుకుంటే.. మిగులు జలాలు ఏపీకి వచ్చేవో, రావో తెలిసేది. కృష్ణా బేసిన్ మొత్తాన్ని ఏపీ కొల్లగొట్టింది. ఇప్పుడు గోదావరి బేసిన్‌కు వచ్చింది. చివరగా చంద్రబాబుకు నేను చెప్పేది ఒక్కటే.. మనం దూరం పెంచుకోవడం ద్వారా సమస్య పరిష్కారం కాదు.. మా తెలంగాణ ప్రాజెక్టులకు గోదావరి బేసిన్‌పై 968 టీఎంసీలు.. కృష్ణా బేసిన్‌లో పరీవాహక ప్రాంతం ప్రకారం... 555 టీఎంసీల నీళ్లు వస్తాయి.. మేం కొన్ని ప్రాజెక్టులు కట్టుకుంటాం. ఈ రెండింటికీ మీరు స్పష్టంగా అనుమతి ఇవ్వండి. ఆ తర్వాత సముద్రంలోకి వెళ్లే నీటిని మీరు ఎంత తీసుకెళ్లినా మాకు అభ్యంతరం లేదు.

### 30 కల్లా నివేదిక ఇస్తాం..

కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి మండలి సమావేశాల మినిట్స్ ఇవ్వాలని జస్టిస్ ఘోష్ కమిషన్ కోరింది. గత ప్రభుత్వంలో 96 సార్లు మంత్రి మండలి సమావేశాలు జరిగినా ప్రాజెక్టు అంచనాలు పెంచడానికి చేసిన తీర్మానాలు మినహా నిర్మాణానికి సంబంధించి మినిట్స్ లేవు. ఎటువంటి ఆమోదం లేకుండానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరంగా మార్చి నిర్మించారు. ఈ వివరాలు తెలిపితే సీఎం కాళేశ్వరం కమిషన్‌ను ప్రభావితం చేస్తున్నారంటూ న్యాయ వివాదాలకు దిగుతారు. ఈ నెల 30వ తేదీలోపు నీటిపారుదల శాఖ కమిషన్ కోరిన అంశాలన్నింటినీ అందజేస్తుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

### రాజకీయాలకు అతీతంగా కొట్లాడుదాం

"రోజుకు 2 టీఎంసీల చొప్పున.. 400 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించాలని కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఆనాటి సమావేశ మినిట్స్‌లో ఇవన్నీ ఉన్నాయి. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అకస్మాత్తుగా మొదలైంది కాదు. 2016లోనే దీనికి బీజం పడింది. 2019లో ఒక దశకు వచ్చింది. 2025కు వచ్చేసరికి వేగవంతమైంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోదావరి-బనకచర్లపై జరిగిన అఖిలపక్ష భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "అన్ని పార్టీలకు సిద్ధాంతాల పరంగా విభేదాలుండొచ్చు. కానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా.. అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. దీనిపై భాజపా ఎంపీ రఘునందన్‌రావు ఒక సందేహం వెలిబుచ్చారు. ప్రాజెక్టులు పూర్తయి.. నికర జలాలు వాడుకున్న తర్వాత.. మిగిలితే వరద జలాలో.. మిగులో జలాలో కానీ.. ఇప్పుడు ప్రాజెక్టులకే అనుమతులు లేవు. మిగులు జలాలనేది ఎలా వచ్చింది? అని అడిగారు. దీనిపై వివరణ ఇవ్వదలుచుకున్నా. తెలంగాణ ఏర్పడిన తరువాత కేంద్రప్రభుత్వం దిల్లీలో 21-9-2016న నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. గోదావరి నది నుంచి మూడు వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని ఆనాటి సీఎం కేసీఆర్ ప్రస్తావించారు. అంటే దీన్ని మొట్టమొదట కనిపెట్టింది కేసీఆర్. ఆ తర్వాత ఇది ఏ కారణాలతోనో ముందుకు సాగలేదు. మళ్లీ 2019 ఆగస్టు 13న.. "రాయలసీమను రతనాల సీమగా మారుస్తా" అని ఆనాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం మొదలుపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు బీజం అక్కడే పడింది. గత ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్ మినిట్స్‌నే ముందుపెట్టి.. మనకు దీన్ని ఒక గుదిబండగా మార్చేందుకు ఏపీ ప్రయత్నం చేస్తోంది. మూడు రకాలుగా మనం ముందుకెళ్లాలి. 1.టెక్నికల్ 2.లీగల్ 3.పొలిటికల్. రాజకీయ కోణంలో ఇప్పటి వరకూ మేం కేంద్ర మంత్రుల వద్ద అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశాం. అయినా మనకు సహకారం అందడంలేదు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనూ దీన్ని ప్రస్తావిస్తాం. ప్రధానమంత్రి సహా అందరినీ కలిసి తెలంగాణ సమస్యను, హక్కులను, నీటి చట్టాలను వివరిస్తాం. అయినా ఫలితాలు పొందలేకపోతే.. న్యాయపరమైన పోరాటం చేద్దాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



### కేసీఆర్, హరీశ్‌లను శిక్షించాలి

బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందిస్తుంటే హరీశ్ మాత్రం నాపై, ఉత్తమ్‌పై బురద చల్లుతున్నారు. ఈ పాపానికి పునాది వేసింది కేసీఆరే. 2016లో జరిగిన సమావేశంలో హరీశ్‌రావు ఉన్నారు. నదీ జలాల్లో తెలంగాణకు జరిగిన నష్టంపై కేసీఆర్‌ని, హరీశ్‌రావునే శిక్షించాలి. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్ల కోసం భారాస తెలంగాణకు అన్యాయం చేసింది. ఒక కాంట్రాక్టర్ పెట్టిన సమావేశంలో కూర్చుని.. కమీషన్లకు కక్కుర్తి పడి.. గోదావరి వరదజలాల్లో 400 టీఎంసీల నీళ్లను రాయలసీమకు తీసుకెళ్లవచ్చని అన్నారు. ఇప్పుడు మీ చేతిలో అధికారం లేదని.. ఆ బురదను మాకు అంటిస్తారా? నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన మీరు.. కృష్ణా బేసిన్‌లో (ఉమ్మడి ఏపీలో) చేపట్టిన ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా కేసీఆర్? ఆనాడు తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి ఉంటే.. లిఫ్టు లేకుండానే గ్రావిటీ ద్వారానే ప్రాజెక్టులన్నీ పూర్తయ్యి.. ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అయ్యేది. కానీ కాసుల కక్కుర్తితో తుమ్మిడిహెట్టి దగ్గర కట్టకుండా వదిలేశారు. కాళేశ్వరం వల్ల రూ.లక్ష కోట్ల ధనం ఆవిరైపోయింది. కేసీఆర్ ధనదాహం.. దోపిడీ వల్ల మేడిగడ్డ కుప్పకూలింది. ఒక్క పిల్లర్ కూలిపోతే ఏమైంది ప్రాజెక్టు ఉంది కదా? అంటున్నారు హరీశ్‌రావు. మేడిగడ్డ గుండెకాయ లాంటిది. ఆ గుండెనే లేకపోతే మిగతా శరీరం ఎందుకు? అఖిలపక్ష సమావేశం పెడితే భారాస ముఖ్య నాయకులు రాలేదు. రాయలసీమ ఎత్తిపోతల జీఓ కేసీఆర్ ఇంట్లో తయారైంది. చంద్రబాబు ముచ్చుమర్రి కడుతుంటే కేసీఆర్ మాట్లాడలేదు.

### కిషన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదు

కీలకమైన అఖిలపక్ష సమావేశానికి రాకుండా పని ఉందంటూ దిల్లీ వెళ్లిన కిషన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదు. గురువారం జలశక్తిమంత్రిని మేం కలవబోతున్నాం. ఆయన ఒక రోజు ముందే జలశక్తిమంత్రిని ఎందుకు కలిశారు? అన్నిరకాలుగా తెలంగాణకు ద్రోహం చేస్తున్నారు. నీళ్ల సెంటిమెంట్‌తో భారాసను బతికించాలని ఆయన ప్రయత్నిస్తున్నారు.

# ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా బనకచర్లపై నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మెట్రో రెండోదశ ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బుధవారం దిల్లీలో పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించారు. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించీ మాట్లాడారు. మెట్రో రెండోదశ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన డీపీఆర్ ఇటీవలే తమకు అందిందని, అధికారులు పరిశీలిస్తున్నారని మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుత డీపీఆర్ పంపి ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తుందని ఆయన చెప్పారు.

# కేసీఆర్ దత్తత గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## నేడు మంజూరు పత్రాల పంపిణీ: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్:** కేసీఆర్ దత్తత గ్రామమైన వాసాలమర్రిలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, వారికి గురువారం మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. యాదాద్రి జిల్లా వాసాలమర్రిలో ఇళ్ల నిర్మాణం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "వాసాలమర్రిని దత్తత తీసుకుంటున్నట్లు 2020 నవంబరు 1న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ ప్రకటించారు. 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి స్థానికులతో సహపంక్తి భోజనం చేసి... బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని, ప్రతి కుటుంబానికి రెండు పడకగదుల ఇళ్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆరోజు నుంచి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయే దాకా ఆయన గ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. తన ఫాంహౌస్‌కు వెళ్లడానికి రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా ఉన్న ఇళ్లను కూల్చివేసి ప్రజలకు నిలువనీడ లేకుండా చేశారు. బాధితులు ఇళ్లు కోల్పోయి తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. వారిని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో సర్వే నిర్వహించి... ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన 205 మందిని గుర్తించాం. వారికి



ఇంటి మంజూరు పత్రాలను గురువారం స్వయంగా నేనే అందజేస్తాను" అని పొంగులేటి పేర్కొన్నారు.



# బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ

## హైదరాబాద్ అనుకూలమనన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్ 18 :** హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని రేవంత్ వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ లో డిఫెన్స్ కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ / సీఈవో డా, జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీ.ఏ. శ్రీనివాస మూర్తి, తదితరులు సీఎంతో భేటీ అయ్యారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని చెప్పారు.బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ, హైదరాబాద్‌ను ఎంచుకోవాలని, ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం వాదనలపై బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించింది. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

# త్వరలో సాగర్ స్పిల్‌వే గుంతల మరమ్మతులు

**నాగార్జునసాగర్ :** నాగార్జునసాగర్ జలాశయాన్ని బుధవారం నిపుణుల బృందం పరిశీలించింది. డ్యాం స్పిల్‌వేపై పడిన గుంతల మరమ్మతులకు ఎలాంటి ఆధునిక పద్ధతులు అవలంబిస్తే సమస్య పునరావృతం కాకుండా ఉంటుందనే అంశంపై ఎంవైకే కంపెనీ నిపుణులు చర్చించారు. ప్రయోగాత్మకంగా కొన్ని గుంతలను తీసుకొని వాటికి ఆధునిక పద్ధతిలో మరమ్మతులు నిర్వహించి.. విజయవంతమైతే అదే పద్ధతిలో అన్నింటినీ పూడ్చుతామని, దానికి సంబంధించిన పనులను త్వరలోనే నిర్వహిస్తామని బృందం తెలిపినట్లు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. స్పిల్‌వేను పరిశీలించిన వారిలో కుల్‌దీప్ తివారి, శ్రీకాంత్‌రాజ్, ఆదిత్యవిక్రమ్‌వర్మ, సుజిత్‌చంద్ర, ఎంజీ ప్రశాంత్, ఎన్నెస్పీ డీఈ శ్రీనివాస్, ఏఈ సత్యనారాయణ తదితరులున్నారు.



# ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు

- 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్
- విచారణ జరిగే కొద్దీ వెలుగు చూస్తున్న అక్రమాలు

**హైదరాబాద్, జూన్ 18 :** ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొన్ని పార్టీలు లేదా వ్యక్తులు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారన్న నెపంతో, పలువురు కీలక రాజకీయ నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు వెల్లడవుతోంది. తాజాగా ఈ కేసులో 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై ఆరోపణలు వచ్చాయి. 2023 నవంబర్ 15 నుండి 30వ తేదీ మధ్యలోనే కనీసం 618 మంది నేతల ఫోన్లను ట్యాప్ చేశారట. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కోటింరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి వంటి నాయకుల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం ట్యాప్ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సహా అనేక పార్టీల కీలక నేతలు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ లక్ష్యంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. నిన్న ఒక్కరోజే తొమ్మిది మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. అందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య, గాంధీ భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారు. ఇవన్నీ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన ఆధారాలతో వెలుగులోకి వచ్చాయి. ఈ రోజు పీసీసీ అధికార ప్రతినిధి జయపాల్ రెడ్డి సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదే విధంగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును కూడా విచారించారు.



## సిట్ కార్యాలయానికి ట్యాపింగ్ బాధితులు

**ఫిర్యాదులు చేస్తున్న పలువురు వ్యక్తులు**

తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో దర్యాప్తును సిట్ వేగవంతం చేసింది. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన బాధితులకు సిట్ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో వాంగ్మూలం ఇచ్చేందుకు జూబ్లీహిల్స్ సిట్ కార్యాలయానికి ఫోన్ ట్యాపింగ్ బాధితులు క్యూ కడుతున్నారు. బాధితుల నుంచి వాంగ్మూలాన్ని సేకరిస్తోంది సిట్. ఇందులో భాగంగా ఈరోజు (బుధవారం) టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చేందుకు సిట్ కార్యాలయానికి వచ్చారు. సిట్ అధికారుల నుంచి తన ఫోన్ ట్యాప్ అయినట్టు సమాచారం వచ్చిందని జైపాల్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. జైపాల్ నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనుంది సిట్. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్కరోజే 600 మంది ఫోన్లు ఒకేసారి ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్లు ట్యాప్ అయిన వారిని బాధితులుగా గుర్తించి వారికి సమాచారం ఇస్తున్నారు సిట్ అధికారులు. ఈకేసులో సాక్షులుగా వారిచ్చే వాంగ్మూలాన్ని రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా పెద్ద మొత్తంలో బాధితుల నుంచి వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. ఈరోజు కూడా మరికొంత మంది బాధితులు సిట్ కార్యాలయానికి వచ్చి వాంగ్మూలాన్ని ఇస్తున్నారు.



## ఉగ్రవాదానికి మద్దతిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

**జీ7 సదస్సులో ప్రధాని మోడీ స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, జూన్ 18 :** ఉగ్రవాదం ఎక్కడున్నా, ఏ రూపంలో ఉన్నా అది మానవాళికి ప్రధాన శత్రువని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కెనడాలో జరిగిన జీ7 సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించుకుంటాయని హెచ్చరించారు. ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి మానవత్వంపై జరిగిన దాడిగా మోదీ అభివర్ణించారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదన్నారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టే అన్ని దేశాలు దీన్ని వ్యతిరేకించాలి. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, విధానాలు స్పష్టంగా ఉండాలి. ఏదైనా దేశం ఉగ్రవాదానికి మద్దతిస్తే అందుకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మోదీ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు అనిశ్చితి, సంఘర్షణలతో ఎక్కువగా బాధపడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక సంక్షోభాలతో ముందుగా దెబ్బతినేది వారేనన్నారు. గ్లోబల్ సౌత్‌లో నెలకొన్న ఆందోళనలు, ప్రాధాన్యతలను ప్రపంచ వేదికపై లేవనెత్తడాన్ని భారత్ తన బాధ్యతగా భావిస్తోందన్నారు. ఇక, ప్రధాని డీప్‌ఫేక్ గురించి కూడా మాట్లాడారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్న మోదీ.. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై వాటర్ మార్కింగ్ లేదా స్పష్టమైన గుర్తు ఉండాలన్నారు. ఈ శతాబ్దంలో సాంకేతికతపై పరస్పర సహకారం అవసరమన్నారు. కృత్రిమ మేధస్సు చుట్టూ ఉన్న ఆందోళనలను పరిష్కరించి, ఆవిష్కరణలు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన నేపథ్యంలో మోదీ కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో సహా పలువురు ప్రపంచ నాయకులను కలిశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.



## మావోలకు మరో ఎదురుదెబ్బ

- రంపచోడవరం ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి
- మృతుల్లో అరుణ, గాజర్ల రవి, అంజు ఉన్నట్లు గుర్తింపు

**రంపచోడవరం, జూన్ 18 :** మావోయిస్టులకు మరో భారీ ఎదరుదెబ్బ తగిలింది. మరో అగ్రనేత హతమయ్యాడు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. దేవీపట్నం మండలం కొండమొదలు అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. వీరిలో ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతిరావు భార్య, స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు అరుణతో పాటు కేంద్ర కమిటీ సభ్యుడుయ గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ ఏసీఎం అంజు ఉన్నట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 2018లో డుంబ్రిగుడ సమీపంలో జరిగిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో అరుణ నిందితురాలిగా ఉన్నారు. ఆమె స్వస్థలం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఉదయ్‌పై రూ. 25లక్షలు, అరుణపై రూ. 20లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకురానున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతానికి మారేడుమిల్లి సీఐ, దేవీపట్నం ఎస్సై, పోలీసు సిబ్బంది బయల్దేరారు.

## సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వడం కుదరదు

**ఏసీబీకి లేఖ ద్వారా కేటీఆర్ స్పష్టీకరణ**

**హైదరాబాద్, జూన్ 18 :** సెల్‌ఫోన్ అప్పగించాలన్న అంశంపై ఏసీబీ నోటీసుకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ లేఖ ద్వారా సమాధానం పంపారు. తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే ఈ చర్యను అంగీకరించేది లేదని తెలిపినట్లు సమాచారం. ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో కేటీఆర్ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్ స్వాధీనం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించారు. అనిశా అధికారులు ఆదేశించినట్లుగా మొబైల్ ఫోన్‌ను, ల్యాప్‌టాప్‌ను వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని న్యాయవాదులు చెప్పినట్టు సమాచారం.

## హనీమూన్ మర్డర్ కేసులో మరో ట్విస్ట్

**సంజయ్ వర్మ అనే వ్యక్తికి సోనమ్ 119 కాల్స్**

**షిల్లాంగ్, జూన్ 18 :** హనీమూన్ మర్డర్ కేసులో మరో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఈ కేసులో లేని కొత్త పేరు తెరపైకి వచ్చింది. ఇటీవల మేఘాలయలో జరిగిన రాజా రఘువంశీ హత్య దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. భార్య సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహ్ ప్లాన్ చేసి, హత్య కోసం కిరాయి హంతకులను నియమించుకున్నారు. మేఘాలయ హనీమూన్‌కి వెళ్లిన సమయంలో భార్య సోనమ్ దగ్గర ఉండీ తన భర్త రాజాను హత్య చేయించింది. ఈ కేసుకు సంబంధించి పోలీసు దర్యాప్తులో సోనమ్ కాల్ డేటాను విశ్లేషించగా మరో పేరు బయటకు వచ్చింది. సంజయ్ వర్మ అనే వ్యక్తికి సోనమ్ మార్చి 1 నుంచి మార్చి 25 వరకు 119 కాల్స్ చేసినట్లు గుర్తించారు. ప్రస్తుతం, అతడి మొబైల్ నెంబర్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఇద్దరి మధ్య జరిగిన ఈ ఫోన్ సంభాషణలపై ఇప్పుడు పోలీసులు దృష్టిసారించారు. మే 23న మేఘాలయాలోని తూర్పు ఖాసీ హిల్స్‌లో రాజాను హత్య చేశారు. వీ సావ్‌డాంగ్ జలపాతం సమీపంలోని లోయలో అతడి మృతదేహాన్ని జూన్ 2న గుర్తించారు. ఆ తర్వాత, జూన్ 08 సోనమ్ ఉత్తర్ ప్రదేశ్ ఘాజీపూర్ పోలీసుల ముందు లొంగిపోయింది. ఈ కేసులో రాజాను ముందుగా దావో అనే పిలిచే కత్తితో హత్య చేశారు. హత్య జరుగుతున్న సమయంలో సోనమ్ అక్కడే ఉందని, ఆమె భర్తపై దాడి తర్వాత అతను కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయిందని, ఆ తర్వాత మరికొన్ని కత్తి దాడుల తర్వాత రాజా రఘువంశీ చనిపోయినట్లు హంతకుల్లో ఒకరైన విశాల్ సింగ్ పోలీసులకు చెప్పాడు.



## సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా పోలీస్ స్టేషన్లు

- పోలీసుల తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కేటీఆర్
- కరికె కుంటయ్య కుటుంబానికి పరామర్శ

**రాజన్న సిరిసిల్ల, జూన్ 18 :** కాంగ్రెస్ హయాంలో సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా పోలీస్ స్టేషన్లు మారాయని పోలీసుల తీరు మారాయని సిరిసిల్ల శాసనసభ్యుడు, మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆత్మహత్యకు పాల్పడిన మాజీ ఎంపిటిసి, బిఆర్ఎస్ నాయకుడు కరికె కుంటయ్య మృతదేహానికి నివాళులు అర్పించి, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలోనే మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వస్తే వారిపైనే కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు. కరికవేణి కుంటయ్య తమ పార్టీ కార్యకర్త అని, ఈ నెల 16న హైదరాబాద్‌లో తనను ఎసిబి అధికారులు పిలిచినప్పుడు ఆయన హైదరాబాద్ వచ్చి తనకు ధైర్యం చెప్పాడని తెలిపారు. ఆరోజు రాత్రికల్లా ఇంటికి తిరిగివచ్చిన తరువాత ఏమైందో గాని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందడంతో మంచి వైద్యం అందించాలని పార్టీ నేతలకు సూచించానని అన్నారు. విషం తాగిన కుంటయ్య కిడ్నీలు ఫెయిలయ్యాయని, దురదృష్టవశాత్తు మంచి కార్యకర్తను కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. లోపల తుఫాన్ వంటి బాధలను దాచుకుని ప్రజల కోసం పనిచేసిన కుంటయ్య తనకు అన్యాయం జరుగుతోందని, తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయిస్తే అతనిపైనే కేసు నమోదు చేయడం దారుణమని మండిపడ్డారు. పోలీసుల తీరుతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన కుంటయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. పోలీసులు సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం పోలీసుల తీరును అదుపులో పెట్టాలన్నారు. కుంటయ్య పెద్దకర్మ వరకు అయ్యే అన్ని ఖర్చులు పార్టీయే భరిస్తుందని అన్నారు. మృతుడి కుటుంబానికి అన్నిరకాలుగా తాము అండగా ఉంటామన్నారు. అతని ఇద్దరు పిల్లల చదువులు, పెళ్లిళ్లు అన్నీ పార్టీ చూసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ సుంకె రవిశంకర్, జడ్పి మాజీ ఛైర్మన్ తుల ఉమ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్లతో వచ్చే నష్టమేమిటో?

**ఉత్తమ్‌కు ఎంపి అర్వింద్ సూటిప్రశ్న**



**హైదరాబాద్, జూన్ 18 :** బనకచర్లతో తెలంగాణకు జరిగే అన్యాయమేంటో చెప్పమంటే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దగ్గర సమాధానం లేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసం ఆయన పవర్–పాయింట్ ప్రజం టేషన్ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాలను స్వీకరించాం. అనేక మంది దివ్యాంగులు వచ్చి తమ సమస్యలు తెలిపారు. వారికి ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. ప్రతి ప్లలెలో కాంగ్రెస్ ఇమేజ్ భూస్థాపితం అయింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సగం కాంగ్రెస్.. సగం భారాస. కేసీఆర్ డైరెక్షన్‌లో తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన చేస్తున్న పని పవర్ పాయింట్ ప్రజంటేషన్. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే నాటకాలాడుతున్నారు. భాజపాపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారు. నన్ను సిట్ పిలవలేదు. మహేశ్‌కుమార్ గౌడ్ ఫోన్ ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదని అర్వింద్ వ్యాఖ్యానించారు.

## ఉత్తరాంధ్రలో ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి మృతి

- రవిపై 25 లక్ష రివార్డు ప్రకటించిన ప్రభుత్వం
- ఎన్‌కౌంటర్‌తో సొంతూరు వెలిశాలలో విషాదం



**వరంగల్, జూన్ 18 :** ఉత్తరాంధ్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వెళిశాలకు చెందిన గాజర్ల రవి మృతి చెందాడు. ఈ ఘటనతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. గాజర్ల రవి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు శోకసంద్రంలో ముని. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచె లుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయి స్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. పెత్తందార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా తాడిత, పీడిత, బలహీన వర్గాల కోసం పోరు బాట ఎంచుకున్న వారిలో వెలిశాలలోని గాజర్ల కుటుంబం ఒకటి. కుటుంబంలోని అందరు కూడా అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమం వైపు అడుగులు వేశారు. గాజర్ల కుటుంబంలోని నలుగురు సోదరుల్లో ముగ్గురు అజ్ఞాతంలోకి వెళ్లారు. శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలో కామ్రేడ్ గాజర్ల రవి కీలక పాత్ర పోషించారు. ఎన్కౌంటర్ లో మృతిచెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ పై 25 లక్షల రివార్డ్ ఉన్నది. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తూ కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు.

# నా ఫోన్ ట్యాపింగ్ నిజం

- విచారణకు ఎక్కడికైనా వస్తా
- జగన్, కేసీఆర్ బంధంతో రక్త సంబంధం మటాష్
- మీడియాతో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

**విశాఖపట్టణం, జూన్ 18 :** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది పచ్చి నిజమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. తన ఫోన్‌తో పాటు భర్త, దగ్గర వాళ్ల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధరించారు. ఆనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచార ణకు ఎక్కడికి రమ్మన్నా వస్తా. తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలి.

**జగన్, కేసీఆర్ బంధంతో రక్త సంబంధం చిన్నబోయింది**

ఆనాడు జగన్, కేసీఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయింది. ఫోన్ ట్యాపింగ్.. తెలంగాణలో నన్ను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఆ ఇద్దరు కలిసి వేసిన స్కెచ్. కేసీఆర్ కోసం జగన్ నన్ను తొక్కి పెట్టాలని చూశారు. ఫోన్




ట్యాపింగ్ జరిగినట్లు తెలిస్తే మీరు ఏం చేశారు అని నన్ను అడగొచ్చు. ఆనాడు ఉన్న పరిస్థితులు వేరు. అప్పుడు జగన్, కేసీఆర్ చేసినవి అరాచకాలు. వీరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చిన్నది. నేను జగన్‌కు తోడబుట్టిన చెలెల్ని. ఆ విషయం మరిచి నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు అని కుట్ర చేశారు. నా భవిష్యత్తును పాతిపెట్టాలని ఎన్నో చేశారు. నాకు మద్దతు పలికిన వాళ్లను బెదిరించారు. రాజకీయంగా నా వాళ్లు రానివ్వకుండా చేశారు. నేను తెలంగాణలో పార్టీ పెట్టడంలో జగన్‌కు ఏ సంబంధం లేదు. కేసీఆర్ కోసం నన్ను తొక్కి పెట్టాలని చూశారు. నా చుట్టూ పరిస్థితులను కష్టతరం చేశారు. నా ప్రతి పోరాటానికి అడ్డుపడ్డారు.' అని షర్మిల అన్నారు.

## గోదావరి వృధా జలాలను వాడుకోవాల్సిందే

**ఆనాడు కేసీఆర్ అభిప్రాయం కూడా ఇదే**

- బనకచర్లకు తరలించాలన్న ప్రతిపాదన సమ్మతం కాదు
- బిసి రిజర్వేషన్ల కోసం 17న రైల్‌రోకో : ఎమ్మెల్సీ కవిత వెల్లడి



**హైదరాబాద్, జూన్ 18 :** తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆమె, ముఖ్యమంత్రి చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు నష్టం జరగదని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చెబుతుండగా, గోదావరి జలాలను తరలించేందుకు కేసీఆర్ అప్పుడు ఒప్పుకున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. కేసీఆర్ గోదావరి నీళ్లు సముద్రంలో వృథాగా పోకుండా వాడుకలోకి తేవాలని మాత్రమే అన్నాడు. కానీ, నదుల అనుసంధానం అంశానికి ఎప్పుడూ ఓకే చెప్పలేదు అని ఆమె వివరణ ఇచ్చారు. ఏపీ కోసం చంద్రబాబు పోరాటం చేస్తున్నారని చెబుతున్నారు. అలా అయితే మన సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు? చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న లాలూచీ ఏమిటి? అని ప్రశ్నించారు. నల్లమల టైగర్ అంటూ కాదు, పని చేసి చూపించండి 'రేవంత్ రెడ్డి నల్లమల టైగర్ అంటూ చెప్పుకుంటున్నారు. అది నిజమే అయితే బొల్లపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును నిలిపివేయాలి. లేదంటే, మీరు కేవలం పేపర్ పులి అని ప్రజలకు తేటతెల్లం అవుతుంది,' అంటూ సెటైర్లు వేశారు. 'ఢిల్లీకి హాఫ్ సెంచరీ కొడుతున్నారు కానీ బీసీల కోసం అడగడంలేదు. బీసీ బిల్లు గురించి మోదీని అడగాలి,' అని స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయం హక్కులు లభించేలా కేంద్రం వెంటనే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ, జులై 17న రైలు రోకో నిర్వహిస్తామని ప్రకటించారు. ఢిల్లీకి వెళుతున్న సీఎం.. బీసీ బిల్లు పట్టుకుని తిరిగి హైదరాబాద్‌కు రావాలి అంటూ హెచ్చరించారు.

# ఆపరేషన్ కగార్‌దే పైచేయి!



ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగి అగ్రనేతలు ముగ్గురు నేలకొరిగారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. మొత్తంగా అగ్రనేతలు అంతా హతమువుతన్నారు. కేంద్రం ఏదైతే కోరుకుంటందో అదే జరుగుతోంది. నిజానికి పీపుల్స్ వార్ రాకతోనే గ్రామాల్లో పెత్తందారీ వ్యవస్థ అంతరించింది. దొరల సామ్రాజ్యానికి చెక్ పడింది. గడీల పాలన అంతమొందింది. ఊర్లో భూస్వాముల అఘాయిత్యాలు ఆగాయి. రాజకీయ నేతల దూకుడు తగ్గింది. ఏదైనా పనిచేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు.

కానీ ఇప్పుడు రాజకీయ నాయకుల పెత్తనం పెరిగింది. భయమన్నది లేకండా పోయింది. భూములను కబ్జా చేస్తున్నారు. అప్పనంగా అమ్ముకుంటున్నారు. తప్పుడు పనులు చేసే రాజకీయ నాయకులకు, బూకబ్జాదారులకు పీపుల్స్ వార్ హయాలో భయం ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే దళాలను చుట్టుముట్టి మట్టుబెడుతున్న కారణంగా మావోలు అంతరించి పోతున్నారు. ముఖ్యంగా మావోలను అంతమొందించాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఈ సమయంలో ఇక చర్చలకు తావు లేదన్న విధంగా కేంద్రం మొండిగా ఉంది. మావోలపైనే ఎందుకనో దూకుడుగా వ్యవహరిస్తోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కానీ, మణిపూర్‌లో అల్లర్లు అణచివేయడంలో కానీ ఇంత దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరి స్తోందని మహాధర్నాలు పలువురు నేతలు విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని పలువురు విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న వారు గళమెత్తారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని కూడా అన్నారు.

ప్రజాస్వామ్యంలో ఏ సమస్య నైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని ,నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే..ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోలతో చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమన మేనని శాశ్వత పరిష్కారం కాదని గుర్తు చేశారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ,అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా ..నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని కూడా విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది.

ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే అని విమర్శించారు. మొత్తంగా ఇప్పుడు కేంద్రం అనుకున్న విధంగా మావోలు అంతమొందించే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. అయితే దోపిడీ ఉన్నంతకాలం పోరాటం ఉంటుంది. రాజకీయ దోపిడీ ఉంటే తిరుగుబాటు తప్పదని చరిత్ర రుజువు చేసింది. రాజకీయ దోపిడీని అరికట్టాలి. జబ్బుకు చికిత్స చేయడం కన్నా అసలు జబ్బులే రాకుండా నిరోధించ గలగడం ముఖ్యమని వైద్యశాస్త్రంలో చెబుతారు. అందుకోసం కృషి చేయడం మంచిది. సమాజంలో ఉత్పన్నమయ్యే అశాంతికి, ఇతర సమస్యలకు పరిష్కారం చూపకుండా కేవలం మావోలను అణచివేస్తే సమస్య సమిసి పోదని గుర్తించాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ప్రజలు అసంతృప్తితో చేసే ఆందోళనలపై ప్రభుత్వం తమ బలాన్ని, బలగాలను ప్రయోగించడం వల్ల లాభం లేదు. ఉద్యమాలను, ఆందోళనలను ప్రతిష్ఠగా తీసుకొని ఎంత గొప్పగా వాటిని అణచివేశామో చెప్పుకోవడం సరికాదు. మార్చి 31 వరకు సంపూర్ణంగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుతం ఎక్కడైతే కేంద్రీకరించి పని చేస్తుందో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి వారిని మట్టుపెడుతున్న తీరుతో వారు అంతమొందడం ఖాయం కానీ...ప్రజల్లో గూడుకట్టుకున్న ఆందోళనలను మాత్రం అణచివేయడం సాధ్యం కాదని గుర్తించాలి.

# నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు

- టెహ్రాన్ హద్దులు దాటింది
- దీనిపై స్పందించడం ఇప్పటికే ఆలస్యమైంది
- అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి
- ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



**న్యూయార్క్:** ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఘర్షణల్లో అమెరికా జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. తాజా పరిణామాలపై ట్రంప్ మరోసారి స్పందించారు. ఇరాన్ లేదా దాని అణుకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసే యోచనలో అమెరికా ఉందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పష్టతనిచ్చేందుకు ట్రంప్ నిరాకరించారు. అయితే, టెహ్రాన్ హద్దులు దాటిందని, దీనిపై స్పందించడం ఇప్పటికే చాలా ఆలస్యమైందన్నారు. వచ్చేవారం చాలా కీలక పరిణామం చోటుచేసుకోవచ్చని, అంతలోపే జరిగే అవకాశం కూడా ఉందని చెప్పారు. "వారం క్రితం.. ఇప్పటి పరిస్థితులకు చాలా తేడా ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో జోక్యం చేసుకుంటానో లేదో తెలియదు. నేనేం చేయనున్నానో ఎవరికీ తెలియదు" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతిపాదన చేసిందని చెప్పిన ఆయన.. ఎప్పుడు, ఏవిధంగా అనే విషయాలను వెల్లడించలేదు. అయితే, టెహ్రాన్ ప్రస్తుతం తననుతాను రక్షించుకోలేని పరిస్థితిలో ఉందని, గగనతల రక్షణ వ్యవస్థలు కూడా లేవన్నారు. ఇరాన్ అగ్రనాయకత్వం గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'గుడ్‌లక్' అంటూ సమాధానమిచ్చారు. టెహ్రాన్‌తో తన యంత్రాంగానికి ఇప్పటికే ఓపిక నశించిందన్నా రు. ఈ యుద్ధంలో అమెరికా జోక్యంపై స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతుండటంపై మాట్లాడుతూ.. దీర్ఘకాల యుద్ధాన్ని తాము కోరుకోవడం లేదన్నారు. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడద న్నదే తాను కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఉద్దేశిస్తూ అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని.. ఆయన సురక్షితంగానే ఉన్నారని చెప్పారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను చంపాలనుకోవడం లేదన్న ట్రంప్.. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీం లీడర్ ఖమేనీ ప్రతిస్పందిస్తూ.. లొంగిపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒకవేళ అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# 'ఆపరేషన్ సింధు' షురూ...

- భారత విదేశాంగ శాఖ ప్రకటన
- ఆర్మేనియా నుంచి విద్యార్థులను భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు



**న్యూఢిల్లీ:** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమవుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. దీనికి 'ఆపరేషన్ సింధు' అని నామకరణం చేసినట్లు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్న వేళ.. ఉత్తర ఇరాన్ నుంచి జూన్ 17న ఆర్మేనియాకు చేరుకున్న 110 మంది విద్యార్థులను భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసింది. వీరంతా ఆర్మేనియా రాజధాని యెరవాన్ నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయల్దేరారు. జూన్ 19న తెల్లవారు జామున న్యూఢిల్లీకి చేరుకోనున్నారు. విదేశాల్లో ఉన్న తన పౌరుల భద్రతకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్ నగరం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో అక్కడి భారత ఎంబసీ ఇప్పటికే ప్రత్యేక అడ్వైజరీని జారీ చేసింది. తక్షణమే ఆ నగరాన్ని వీడాలని కోరింది. టెహ్రాన్ వెలుపల సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారతీయులకు సూచించింది. ఇప్పటివరకు భారత ఎంబసీని సంప్రదించని భారతీయులు వెంటనే దౌత్యాధికారులతో కాంటాక్ట్ అవ్వాలని కోరిన విషయం తెలిసిందే.

### దిల్లీ తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్

ఇరాన్–ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణవాసులకు సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం దిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభించింది. ఇప్పటివరకూ రాష్ట్ర వాసులు ఎవరూ ప్రభావితం అయినట్లు సమాచారం లేకపోయినా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందుజాగ్రత్తగా ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తాము ఉంటున్న దేశాల్లో గానీ, ప్రయాణాల్లో గానీ ఇబ్బంది పడుతున్న తెలంగాణ వాసులు కింద పేర్కొన్న నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. వందన–రెసిడెంట్ కమిషనర్ పీఎస్– 91 9871999044, జి.రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్– 91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్– 91 9910014749, సీహెచ్ చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి– 91 9949351270.

## ఫాస్టాగ్ వార్షిక పాస్..
# ఇదో గేమ్ ఛేంజర్
### పవన్ కల్యాణ్ ట్వీట్



**అమరావతి:** జాతీయ రహ దారులపై ప్రయాణించే వాహనదా రులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థను ప్రవేశపె ట్టనున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించ డంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. భారత రహదారి మౌలిక సదుపా యాల ప్రస్థానంలో దీన్నో గేమ్ ఛేంజర్‌గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ నిర్ణయంతో ఫాస్టాగ్ వార్షిక పాస్ తీసుకురావాలన్న ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్‌కు పరిష్కారం లభించినట్లవుతుందని పేర్కొన్నారు. టోల్ చెల్లింపులను సరళీకృతం చేస్తూ.. ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఉపశమనం కలిగించేలా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను అమలులోకి తీసుకొస్తున్నందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రూ.3వేల వార్షిక పాస్‌తో వాహన దారులకు ఆర్థిక ఉపశమనం కలగడం మాత్రమే కాదు.. దేశ వ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, వివాద రహిత హైవే ప్రయాణం సాకారమవుతుందన్నారు. దీని ద్వారా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ రెగ్యులర్‌గా ప్రయాణించే వారికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొ న్నారు. వారికి సమయంతో పాటు భారం కూడా తగ్గుతుం దన్నారు. ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకోవాల్సి ఉంటుందని ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టును డిప్యూటీ సీఎం కార్యాలయం రీట్వీట్ చేస్తూ పైవిధంగా స్పందించింది.

# విమానం కూలిన చోట 70తులాల బంగారం సేకరణ

### మానవత్వాన్ని చాటుకున్న రాజేశ్ పటేల్



**అహ్మదాబాద్:** ఇటీవల అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటన అంతులేని విషాదం నింపింది. ఈ విషాద సమయంలో సత్వరమే స్పందించి మానవత్వాన్ని చాటుకున్న వ్యక్తుల్లో రాజేశ్ పటేల్ ఒకరు. విమానం కుప్పకూలిన విషయం తెలియగానే హుటాహుటిన ఘటనా స్థలానికి పరుగెత్తిన ఆయన.. మృతదేహాలు, క్షతగాత్రులను అంబులెన్సుల్లోకి ఎక్కించడంలో ఎంతగానో కృషిచేశారు. సహాయక చర్యల అనంతరం ఘటనా స్థలం వద్ద పొగలు కక్కుతున్న శిథిలాల్లో వెతికి మరీ.. దాదాపు 70 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు, కొన్ని అమెరికా డాలర్లు సేకరించి పోలీసులకు అప్పగించడం ద్వారా తన నిజాయతీని సైతం చాటుకున్నారు.

### తొలి 20 నిమిషాలు దగ్గరికి వెళ్లలేకపోయాం..

నిర్మాణ రంగంలో వ్యాపారిగా ఉన్న రాజేశ్ పటేల్.. ఈ దుర్ఘటన అనంతరం అక్కడ నెలకొన్న పరిస్థితులను వివరించారు. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కూలగానే ఒక్కసారిగా శబ్దం వచ్చి.. ఆకాశంలోకి ఓ పెద్ద అగ్నిగోళంలా ఎగసిపడిందన్నారు. అప్పుడు తాను ఘటనా స్థలానికి కేవలం 300 మీటర్ల దూరంలోనే ఉన్నట్లు తెలిపారు. బీజే వైద్య కళాశాల హాస్టల్ కాంప్లెక్స్‌పై విమానం కూలిందని తెలిసిన వెంటనే వీలైనంత ఎక్కువ మందిని కాపాడాలనే ఆశతో ఆ ప్రాంతానికి పరుగెత్తినట్లు చెప్పారు. కానీ, తొలి 15 నుంచి 20 నిమిషాల వరకు ఘటనా స్థలికి దగ్గరగా తాము వెళ్లలేకపోయామన్నారు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాతే సహాయక చర్యలు ప్రారంభించగలిగినట్లు వెల్లడించారు.

### పాత చీరలతోనే మృతదేహాల తరలింపు..

"మాకు అందుబాటులో స్ట్రెచర్లు లేవు. దీంతో పాత చీరలు, బెడ్ షీట్లు, గన్నీ బ్యాగుల్లోనే మృతదేహాలు, క్షతగాత్రులను అంబులెన్సు ల్లోకి ఎక్కించాం" అని వివరించారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత ప్రయాణికులకు సంబంధించిన వస్తువులను సంరక్షించే పనిలో నిమగ్నమైన అతడికి ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న 10– 15 హ్యాండ్ బ్యాగ్‌లు కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. "వీటిలో 70 తులాల బంగారు ఆభరణా లు, 8–10 వెండి వస్తువులు, కొన్ని పాస్‌పోర్టులు, భగవద్గీత పుస్తకం, రూ.50వేల నగదు, 20 డాలర్లు ఉన్నాయి. వాటిని మేం రెస్క్యూ ఆపరేషన్ పర్యవేక్షిస్తున్న పోలీస్ అధికారికి అప్పగించాం" అని తెలిపారు. గతంలో ఫొటో గ్రాఫర్‌గా పనిచేసిన పటేల్.. 2008లో అహ్మదాబాద్ వరుస పేలుళ్ల తర్వాత అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో వాలంటీర్‌గా పనిచేశారు.

### ప్రతి వస్తువునూ అప్పగిస్తాం: పోలీసులు

మరోవైపు, విమాన దుర్ఘటన జరిగిన ప్రదేశం నుంచి స్వాధీనం చేసుకున్న ప్రతి విలువైన వస్తువును మృతుల బంధువులకు అప్పగించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఒక జాబితాను తయారు చేసి ఎయిరిండియాతో సమన్వయం చేసుకొని అందించే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న వారిలో 241మంది మృతి చెందగా.. ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. అలాగే, ఈ విమానం భవనాలపై కుప్పకూలడంతో ఐదుగురు ఎంబీబీఎస్ విద్యార్థులతో పాటు మరో 29మంది ప్రాణాలు కోల్పోవడం విషాదం రేపింది.

# డిఎన్‌ఏ పరీక్షలతో మృతుల గుర్తింపు

### గుర్తించిన వారి మృతదేహాల అప్పగింత

**అహ్మదాబాద్, జూన్ 18 :** అహ్మదాబాద్‌లోప్రమాదానికి గురైన ఎయిరిండియా బోయింగ్ విమాన మృతుల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. డిఎన్ఏ టెస్టుల ద్వారా గుర్తించిన వారి శరీరీ భాగాలను వారి కుటుంబాలకు అప్పగించారు. విపరీతమైన వేడిలో కాలిన శరీరాలను డెన్ఏ ద్వారా గుర్తించడం కష్టసాధ్యంగా మారినా చివరకు ప్రక్రియను ముగించారు. ప్రమాదం వాటిల్లిన ఐదు రోజుల తర్వాత 163 మృతదేహాల గుర్తింపు పక్రియ పూర్తయింది. దీనికోసం డీఎన్‌యే పరీక్షలపై ఆధారపడిన విషయం తెలిసిందే. 124 భౌతికకాయాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. విమానంలో ఉన్న 242 మందిలో ఒక్కరు మినహా అందరూ, బయట మరో 29 మంది ఈ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఎయిరిండియా పైలట్ సుమీత్ సభర్వాల్‌కు మంగవారం ముంబయిలో అంత్యక్రియలు నిర్వహించారు. 35 ఏళ్లుగా పనిచేస్తూ ఎంతోమందిని ఆయన తీర్చిదిద్దారని సహచరులు చెమర్చిన కళ్లతో గుర్తుచేసుకున్నారు. మృతిచెందిన సిబ్బందిలో మరికొందరి అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రమాదంపై విచారణ చేపట్టిన బృందం మూడు నెలల్లో నివేదిక సమర్పించనుందని పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. ఎయిరిండియా వద్దనున్న 34 బోయింగ్–787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో 12 వాటికి తనిఖీలు పూర్తయ్యాయని, వాటిలో ఎలాంటి లోపాలు బయటపడలేదని పుణెలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 12న బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంపై విమానం కుప్పకూలి, మంటలు చెలరేగడంతో.. అందులోని విద్యార్థులు భయాందోళనకు గురికావడంపై మరో వీడియోలో వెలుగులోకి వచ్చింది. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు విద్యార్థులు రెండు, మూడు అంతస్తుల్లోని బాల్కనీల నుంచి బెడ్‌షీట్లు, తాళ్ల సాయంతో కిందికి దూకడం అందులో కనిపించింది. భవనానికి ఒకవైపు భారీగా మం టలు చెలరేగగా.. మరోవైపు నుంచి వీరు కిందికి దూకుతున్నట్లు వీడియోలో ఉంది. ప్రమాద బాధితులకు అవసరమైన న్యాయసాయం అందించడానికి గుజరాత్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ ముందుకు వచ్చింది.




# కరోనా తాజా వ్యాప్తికి..
### ఆ నాలుగు సబ్-వేరియంట్లే కారణం

**పుణె:** దేశవ్యాప్తంగా ఇటీవల మళ్లీ కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న విషయం తెలిసిందే. తాజా పెరుగుదలకు ఒమిక్రాన్‌కు చెందిన నాలుగు ఉపరకాలే కారణమని పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ వెల్లడించింది. జీనోమ్ సీక్వెన్సింగ్‌లో ఈ కొత్త ఉపరకాలను గుర్తించినట్లు పేర్కొంది. వ్యాక్సిన్‌ల సామర్థ్యాలను అంచనా వేయడంలో తాజా ఫలితాలు దోహదం చేస్తాయని తెలిపింది. "దేశవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల నమూనాలకు జన్యుపదార్థ విశ్లేషణ నిర్వహించగా ఒమిక్రాన్‌కు సంబంధించి నాలుగు ఉప రకాలు వెలుగు చూశాయి. ఎల్‌ఎఫ్.7, ఎక్స్‌ఎఫ్‌జీ, జేఎన్.1.16, ఎన్‌బీ.1.8.1 వేరియంట్లుగా గుర్తించాం. తొలుత జేఎన్.1.16 కారణంగా కేసులు పెరిగినప్పటికీ.. మే నుంచి ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ ప్రభావం ఎక్కువగా ఉంది. ఎల్‌ఎఫ్.7, ఎల్‌పీ.81.2లు కలిసి ఎక్స్‌ఎఫ్‌జీగా రూపాంతరం చెందాయి" అని ఎన్‌ఐవీ–పుణె డైరెక్టర్ డాక్టర్ నవీన్ కుమార్ వెల్లడించారు. కొత్త వేరియంట్లను ఎప్పటికప్పుడు వేరుచేస్తూ జీనోమ్ సీక్వెన్సింగ్ చేపడుతున్నామని చెప్పారు. ఏప్రిల్ రెండో వారం నుంచి దేశంలో కరోనా వైరస్ కేసులు వెలుగు చూడడం మొదలైంది. కేంద్ర ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6483 కొవిడ్–19 క్రియాశీల కేసులు ఉన్నాయి. జనవరి 1 నుంచి ఇప్పటివరకు 113 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉండగా, గుజరాత్, కర్ణాటక, దిల్లీ రాష్ట్రాల్లో వైరస్ వ్యాప్తి అధికంగా ఉంది. ఇన్‌ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉందని, రోగులు ఇంటివద్దే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## చెంగిచెర్ల డిపో నుండి ప్రత్యేక ప్యాకేజీ టూర్



**బోడుప్పల్, నేడు న్యూస్:** దైవ భక్తులకు దేవాలయాల దివ్యదర్శనాలు కల్పించేందుకు తెలంగాణ ఆర్టీసీ సంస్థ ప్రవేశపెట్టిన ప్రత్యేక టూర్ ప్యాకేజీ ని భక్తులు వినియోగించుకోవాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 27న చెంగిచెర్ల డిపో నుండి ఉప్పల్ చౌరస్తా మీదుగా ముచ్చింతల్ లోని శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం, కొత్తూర్ మీదుగా షాద్ నగర్ లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, అమ్మపల్లిలోని శ్రీ సీతారామస్వామి దేవాలయం, వెండికొండ లోని శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి దేవాలయాల దివ్యదర్శనాల నిమిత్తం ప్రత్యేక ప్యాకేజ్ టూర్ బస్సు లు నడుపుతున్నట్లు ఆమే తెలిపారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో పరిధిలోని పలు కాలనీలు, గ్రామాలు, మున్సిపాలిటీలకు చెందిన భక్తులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. 30 నుండి 40 మంది ప్రయాణికులు కలిగి ఉంటే వారి కాలనీ వద్ద నుండి దేవాలయ దర్శనాలకు తీసుకువెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ప్యాకేజీ లో పెద్దలకు రూ. 600, పిల్లలకు రూ. 300 ఉంటుందన్నారు. ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకొని సద్వినియోగపర్చుకోవాలని ఆమే కోరారు.



## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) మండల అధ్యక్షులు పడమటి దామోదర్ రెడ్డి

**వలిగొండ, నేడు న్యూస్:** జర్నలిస్టులకు ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు ) మండల అధ్యక్షుడు పడమటి దామోదర్ రెడ్డి అన్నారు బుధవారం మండల కేంద్రంలోని ఐజేయూ మండల కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం ప్లాట్లు ఇండ్లు మంజూరు చేయాలన్నారు జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజుల్లో 50% రాయితీ ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్ మండలం ప్రధాన కార్యదర్శి మధు బాబు జిల్లా నాయకులు రాపోలు సుదర్శన్ పలుసం మైసయ్య బాలరాజు నాగెల్లి వలి బాలగోని మధు బాలగోని సంతోష్ కుమార్ దంతూరు గోపి పోలేపాక బిక్షపతి రాగీరు మల్లేశం బాలరాజు మిర్యాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## న్యూ ఎరా విద్యాసంస్థల అధినేత వేణుగోపాల్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

**కూకట్‌పల్లి, నేడు న్యూస్ :** న్యూ ఎరా విద్యాసంస్థల అధినేత ఏ.వేణుగోపాల్ రెడ్డిని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు,ఉపాధ్యాయులు,జిల్లా ప్రైవేట్ పాఠశాలల యజమానులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, విద్యారంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు దీటుగా సాంకేతికతతో కూడిన నూతన విద్యా బోధనతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ వేణుగోపాల్ రెడ్డి విలువైన సేవలు అందిస్తున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ ఏరా విద్యాసంస్థలకు చెందిన ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్‌లో సత్తా చాటిన న్యూ కేంబ్రిడ్జి విద్యార్థులు

### విద్యార్థులను అభినందించిన యజమాన్యం



**పరకాల, నేడు న్యూస్ :** ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పరకాల పట్టణానికి చెందిన న్యూ కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు జి. సాయి ప్రీతి (520256 3032) 856 ర్యాంకు సాధించగా బి. దీక్షిత (52025030854) 795 ర్యాంక్ సాధించి సీట్ పొందడం జరిగింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించిన విద్యార్థులను పాఠశాల యజమాన్యం అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ సురేందర్ రెడ్డి, హెచ్ఎం శైలజ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నైపుణ్యత నేర్పుతున్నామని, రానున్న రోజుల్లో మరింత మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలలో సీట్లు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నానని, అన్ని సమస్యలను దశలవారిగా పరిష్కరిస్తామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 12 ,17, 18, 19, 20 వ వార్డులలో రూ.7.45 కోట్లతో వీడీసీసీ రోడ్లు, యూజీడీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలను అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమం లో బీజేఎంసీ కమిషనర్ శరత్ చంద్ర మాజీ కార్పొరేటర్ రాము బీజేఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, ఆంజనేయులు, అంతరం నరేష్, సురేష్ గౌడ్, సుమన్ గౌడ్, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన

# ప్రధాన హామీని నిలబెట్టుకోవాలి

### కాంగ్రెస్ పార్టీకి బీసీ హక్కుల సాధన సమితి విజ్ఞప్తి



**హైదరాబాద్, నేడు న్యూస్:** తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో హామీ ఇచ్చి ఉన్నారని అందువల్ల 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేసిన పత్రిక ప్రకటనలో..కేంద్ర ప్రభుత్వానికి కులగణన పై చిత్తశుద్ధి ఉంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపాలని, 42 శాతం రిజర్వేషన్ అంశం కేంద్రం పరిధిలో ఉన్నందున, ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీ రిజర్వేషన్లు తేలకపోయినప్పటికీ పార్టీ పరంగా 42 శాతం బీసీ రిజర్వ్ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని రేవంత్ ప్రభుత్వం సిద్ధమవుతుందని కోర్టు తీర్పు కోసం చూస్తే మరింత జాప్యం అవుతుంది కాబట్టి ఎన్నికలకే మొగ్గు చూపుతున్నట్టు వార్త కథనాలు వస్తున్నాయని, పార్టీ పరంగా 42 శాతం బీసీలకు ఇస్తే ఒరిగేది ఏముందని అన్ని పార్టీలు 42 శాతం బీసీలకి ఇస్తే ఎవరో ఒక బీసీ గెలుస్తారు కానీ కేవలం ఒక పార్టీ బీసీకి ఇస్తే ఇతర రాజకీయ పార్టీలు డబ్బున్న అగ్రవర్ణాలకు టికెట్లు ఇచ్చి నిరుపేద గా జీవిస్తున్న బీసీలను ఎన్నికల్లో ఓడిస్తారని, కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీలకు ఇస్తామని ప్రకటిస్తే చట్టబద్ధంగా బీసీలు పొందుతున్న ఇప్పుడున్న 23%రిజర్వేషన్ కూడా కోల్పోవలసిన పరిస్థితి ఆయన అన్నారు, తెలంగాణ అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లు ఆమోదించారు తప్ప మిగతా ప్రక్రియను కొనసాగించలేకపోయారని అఖిలపక్ష బృందాన్ని ప్రధాని వద్దకు మరియు రాష్ట్రపతి వద్దకు తీసుకువెళ్లి వారిని కలిసి షెడ్యూల్ నైన్ లో రిజర్వేషన్ బిల్లు చేర్పించేలా ఒత్తిడి చేయలేకపోయారని, 73, 74 రాజ్యాంగ సవరణ చేసినప్పుడు ఆర్టికల్ 243- డి6 ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్న విషయాన్ని రేవంత్ ప్రభుత్వం గుర్తించాలని ఎట్టి పరిస్థితులలో బీసీలను మోసం చేయడం తగదని 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ఆయన కోరారు.

## అంతరించిపోతున్న కళలను బతికించుకుందాం

### రాష్ట్ర అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్



**పరకాల నేడు న్యూస్ :** హన్మకొండ జిల్లా పరకాల పట్టణం లోని ఎఫ్.జె గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కళాకారుల సంఘం వరంగల్,హన్మకొండ,భూపాలపల్లి జిల్లాల కళాకారుల జిల్లా సదస్సు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ పల్లెల్లో ఆటలకు, పాటలకు విడదీ- యలేని బంధం ఉన్నదని ఇక్కడి కళలు ప్రజా కళలు పాటలు, గేయాలు,కథలు మొదలైన సారస్వతము అనేక కళా రూపాల్లో వైభవాన్ని పల్లె ప్రజల నాలుక మీద నాట్యమాడుతాయని అవే జానపద కళలు అని ఇవి తెలంగాణ ప్రజల కళారుచికి చక్కని నిదర్శనాలుగా నిలుస్తాయని పల్లె ప్రకృతి రమణీయత శ్రమ సౌందర్యం తోటివారిపట్ల ఆప్యాయతను కనబరచడం ప్రకృతిని ప్రేమించడం జానపదాల్లో అంతర్లీన అంశాలు అని హంగు, ఆర్బాటం లేకుండా సులువైన చిన్న చిన్న పదాలతో లోతైన అర్థం తెలియజెప్పడమే జానపద గొప్పదనం అని భిన్నత్వం నెలకొన్న భారతావనిలో భిన్న కళారూపాలు ప్రదర్శితమవుతూ వినోదాన్ని మానసిక ప్రశాంతతను చేకూర్చుతాయని అయితే ఇవి క్రమేపీ అంతరించిపోతూ అవసానదశకు చేరుకుంటున్నాయని వాటిని కాపాడుకోవాల్సిన భాధ్యత మనందరిపైన ఉందని శ్రీనివాస్ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ,ప్రధాన కార్యదర్శి ఉందేకోటి కవిత,భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నిమ్మల రాజు, దయాకర్,పూర్ణయ్య,సీనియర్ కళాకారులు బండి సమ్మయ్య, భూక్య శ్రీనివాస్,బర్ల గట్టయ్య, నల్ల ధర్మారెడ్డి,ఉడుత మల్లయ్య, కోగిల రవి (డబ్బాల్) సాద సాంబయ్య,హనుమంత రావు,గడ్డం మూగయ్య అలువాల రాజేందర్,పైళ్ల సమ్మయ్య,తాడేం సమ్మక్క,మాటేటి రజిత,జన్ను రజిత,పంగ భాగ్యలత,కోరుకంటి వనమాల తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి

### ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్‌పల్లి, నేడు న్యూస్ :** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ లో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలసి పలు అభివృద్ధి పనులపై బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఐదో ఫేస్, మలేషియన్ టౌన్షిప్ ప్రాంతంలో డ్రైనేజ్ సమస్యను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఇరుపక్షాల వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని, ఏమైనా ఇబ్బంది ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించి పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గత రెండేళ్ల క్రితం 100 పడకల ఆసుపత్రి కొరకు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని పరిశీలించి నిధులు మంజూరైనా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి నిర్మించడంలో జాప్యం చేస్తున్నారని, నిరుపేదలకు ఉపయోగపడే విధంగా ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేస్తే నేటికీ ఒక్క అంగుళం కూడా పని మొదలుపెట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రమ్య గ్రౌండ్ వద్ద పాఠశాల పనులను పర్యవేక్షించారు. నిరుపేదలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అలసత్వానికి ఉదాహరణే ఈ పాఠశాల నిర్మాణ జాప్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. హౌసింగ్ బోర్డ్ నుంచి ఎటువంటి అభ్యంతరం లేకపోయినా పనులు చేపట్టడానికి ప్రభుత్వం, కలెక్టర్ ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయండని వేడుకున్నారు. సమీక్ష సమావేశంలో అసోసియేషన్ సభ్యులు అందించిన వినతి పత్రాలను స్వీకరించి ఎక్కడికక్కడ ప్రజలకు ఇబ్బంది లేకుండా సమస్యలు పరిష్కరించాలని, పార్కుల నిర్వహణ లోపం వల్ల ఓపెన్ జిమ్ములు, చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు దెబ్బతిన్నాయని, వాటిని ఎందుకు ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించడం లేదని, దయచేసి వాటిని కాపాడండని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గం కోఆర్డినేటర్ ఆర్.సతీష్ అరోరా, డివిజన్ అధక్షులు కృష్ణారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ రాయ్, జిహెచ్ఎంసికి చెందిన అన్ని విభాగాల అధికారులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో

# సమస్యల పరిష్కారానికి చర్యలు

### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ హౌసింగ్ బోర్డ్ లేక్ వ్యూ కాలనీలో జలమండలి, పార్టీ నాయకులు కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలంలో స్థానికంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వర్షాకాలాన్ని దృష్టి ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందుకు తలెత్తకుండా చూడాలని, భూగర్భ డ్రైనేజ్ లైన్ పూర్తి ఎత్తున లైన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అదేవిధంగా మట్టి రోడ్డు ఉండడంతో వరద నీరు చేరుకొని చాలా ఇబ్బందులు గురవుతున్నారని, వెంటనే నూతన సివరాజ్ పై ప్రణాళికలు వేసి మంజూరుకు పంపాలని తెలిపామన్నారు. అదేవిధంగా నూతన సిసి రోడ్ పనులు ప్రణాళిక కూడా రూపొందించాలని, జీహెచ్ఎంసీ, అదేవిధంగా నూతన పైపులైన్ మ్యాచ్ అయ్యే విధంగా, దానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, బస్తీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ బోర్డు సూపర్వైజర్ ప్రసాద్, జీహెచ్ ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ భాను, మాజీ డివిజన్ ప్రెసిడెంట్ అడికె జనార్ధన్, సీనియర్ నాయకులు ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, శర్మ, నర్సిరెడ్డి, గయాదర్, అభిషేక్, తలారి చిన్న, కొండల్, శంకర్, మధుసూదన్ రెడ్డి, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించండి

### టిటిఈడబ్ల్యూప రాష్ట్ర అధ్యక్షులు హతిరామ్ నాయక్

**ఇల్లందు, నేడు న్యూస్ :** బుధవారం న్యూ ఢిల్లీ లో నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబల్ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర అధ్యక్షులు వి హాథిరామ్ నాయక్. ఈ సందర్భంగా హథిరాం నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు,ఏజెన్సీ ప్రాంతంలో జివో నం:3 పునర్ధరణ చేసే నలభై మండలాలలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు పోడు భూములకు పట్టాలు రానివారికి పట్టాలు ఇవ్వాలని,ఏజెన్సీ ప్రాంతంలోనీ ప్రవేటు విద్యా సంస్థలలో హై కోర్టు తీర్పు అనుగుణంగా ఎస్సీ,ఎస్టి లకు 25 శాతం రిజర్వేషన్ పాటించాలని,పిసా చట్టం 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని హుస్సేన్ నాయకును కోరడం తిరిగిందని హతిరామ్ నాయక్ తెలిపారు. స్పందించిన హుస్సేన్ నాయక్ అన్ని సమస్యలు త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి రాథోడ్,సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్,మాజీ సర్పంచ్ పాప నాయక్,గిరిజన విద్యార్థి సంఘం నాయకులు శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పైవరవీలతో రిజర్వేషన్లు పొందాలని చూస్తున్నారు



**మొయినాబాద్, నేడు న్యూస్ :** కొందరూ ప్రజాప్రతినిధిలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అనుకూలంగా రిజర్వేషన్లను తీసుకువచ్చే విధంగా పైవరవీలు చేస్తున్నారని బీసీ సంఘానికి చెందిని కే. చీరంజీవి ఆరోపించారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామానికి చెందిన చిరంజీవి బుధవారం మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. అమ్డాపూర్ గ్రామంలో 2006 ఓట్లు ఉండగా అందులో బీసీలు 915 మంది ఉన్నారని కానీ నేటికి బీసీలకు రిజర్వేషన్ ఇప్పటి వరకు రాలేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేసి జనాభ ప్రతిపదికన రిజర్వేషన్లు ఖారాలు చేయాలని పైరవీలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి అనగారిన వర్గాల ప్రజలు అధికారంలోకి వచ్చేందుకు అవకాశం లేకుండా పోయిందని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు అమ్డాపూర్ గ్రామంలో బీసీలు సర్పంచ్ ఇతర పదవులు పొందలేదని చెప్పారు.

## అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలి

### బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు షేక్ గౌస్ ఉద్దీన్



**కారేపల్లి, నేడు న్యూస్, సింగరేణి :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఈ జాబితాను రూపొందించడంలో ఆంతర్యం ఏమిటని సింగరేణి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా షేక్ గౌసుద్దీన్ మాట్లాడు తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ఇల్లు లేని వారికి, కిరాయి గృహాల్లో ఉన్న వారికి కాకుండా ఇందిరమ్మ కమిటీల పేరుతో సింగరేణి గ్రామపంచాయతీ వ్యాప్తంగా అర్హులకు కాకుండా, ఇందిరమ్మ కమిటీలు వారికి అనుకూలంగా ఉన్న వారికే ఇల్లు మంజూరు చేస్తున్నారని అర్హులైన లబ్ధిదారులను పక్కన పెడుతున్నారని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి నాయకులు పైరవీలు జోరుగా జరుగుతున్నాయి. ముగ్గురు మంత్రులు తక్షణమే స్పందించి మండలంలో అర్హులైన లబ్ధిదారులకే ఇండ్లు మంజూరు చేయాలని, వీటి ఎంపికలో పూర్తి పారదర్శకతను పాటించాలని డిమాండ్ చేశారు. నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.




## ప్రపంచ గ్రామీభివృద్ధి దినోత్సవ పోస్టర్ విడుదల

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** ఆసియా, పసిఫిక్ కోసం ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయితీ రాజ్, రూరల్ ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్డీపీఆర్ క్యాంపస్‌లో ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ అనిల్ కె.గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత అభివృద్ధి చట్రంలో ఆదాయ అసమానతలు, అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ మోడల్ ఈ అంతరాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని ఆయన ప్రతిపాదించారు. ఐటీ రంగంలో పట్టణ స్టార్టప్‌లకు కేటాయించిన రిస్క్ క్యాపిటల్ మాదిరిగానే, ఎంటర్‌ప్రైజ్ అభివృద్ధిని పెంపొందించడానికి గ్రామీణ స్టార్టప్‌లకు సమానమైన మద్దతు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. ఇది దేశంలో సమ్మిళిత, సమగ్ర వృద్ధిని సాధించడానికి చాలా అవసరమని, డబ్ల్యూఆర్డీడీ వేడుక, అట్టడుగు వర్గాల కోసం, వారి ద్వారా, అట్టడుగు వర్గాల కోసం సృష్టించబడిన అట్టడుగు స్థాయి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని ప్రొఫెసర్ గుప్తా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి నరేంద్ర కుమార్, సీఐఆర్డీఏపీ డీజీ డాక్టర్ పి.చంద్ర శేఖర్, ఆర్ఈఈడీఎస్ గౌరవ కార్యదర్శి డాక్టర్ రవి రెడ్డి, ఇండోనేషియా, శ్రీలంక, మలేషియా, వియత్నాం, లావో పీడీఆర్, మయన్మార్, థాయిలాండ్, ఫిజి, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్, భారతదేశం వంటి 11 సీఐఆర్డీఏపీ సభ్య దేశాల (సీఎంసీలు) ప్రతినిధులు హాజరయ్యారు.



## ముగ్గుల పోటీలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

**రాజేంద్రనగర్ నేడు న్యూస్ :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వాహణపై అవగాహన కల్పించేందుకు చొరవతో పని చేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో వందరోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ మహిళా సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారికకు బాధ్యతను అప్పగించడంతో పోటీలలో విజేతలను గుర్తించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మన పర్యావరణ పరిరక్షణే ప్రధాన ఎజెండాగా పని చేయడం జరుగుతుందని తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో అన్ని అంశాలను భాగం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి సెప్టెంబర్ 10 వ తేదీన ఇవ్వనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలో 14 మంది స్వరూప, కవిత, జోష్ణ, సుష్మ, శిరీష, అనూష, రాణి, రాజశ్రీ, మీనాక్షి, మంజుల, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇండ్లు

### - యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం మాజీ అధ్యక్షులు ఎలిగెపల్లి శ్రీనివాస్ యాదవ్

**మొయినాబాద్ నేడు న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టిందని యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం మాజీ అధ్యక్షులు ఎలిగెపల్లి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో అర్హులైన పేదలకు మంజూరైన ఇండ్లు నిర్మించుకునేందుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు ఇండ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్రూమ్ పేరుతో ఏ ఒక్కరికి వంచలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సన్నబియ్యం, రైతు బంధు, రాజీవ్ యువ వికాసం, ఉచిత విద్యుత్, గృహ జ్యోతి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు నాణ్యతతో నిర్మించుకోని కుటుంబ సభ్యులు ఆనందంగా ఉండాలన్నదే కాంగ్రెస్ ముఖ్యలక్ష్యమని ముఖ్యమంత్రి ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుడు పంచలింగాల రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంది అనిల్ ముదిరాజ్, తొండిపల్లి రాములు, బంది శేఖర్, కొండకళ్ల జగన్నాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఇండ్ల కూల్చివేతకు నిరసనగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం

**జవహర్ నగర్, నేడు న్యూస్ :** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల రెవెన్యూ , మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలను పలు ఇండ్లను కూల్చివేశారు. ఈ కూల్చివేతలను నిరసిస్తూ బుధవారం జవహర్ నగర్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ జవహర్ నగర్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల ఇళ్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అధికార పార్టీ నాయకులు జవహర్ నగర్ లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జవహర్ నగర్ గ్రామ నిర్మాణంలో గత 35 సంవత్సరాలుగా పేదలకు భారతీయ జనతా పార్టీ అండగా ఉందన్నారు. ఇటీవల కాలంలో రెవెన్యూ అధికారులు వివిధ కారణాలతో పేదల ఇళ్లను కూల్చడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్ నగర్ లోని ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్, జవహర్ నగర్ పశ్చిమ శాఖ అధ్యక్షులు కమల్, నాయకులు కావలి మహేందర్ యాదవ్, ఉడత సంతోష్ గుప్తా, దొంతమల్ల రాంబాబు, ముత్యం సుజాత, మరాటి బాబు, అశోక్ గౌడ్, వేపుల సన్నీ, ముచ్చర్ల యాదగిరి, మహేష్ గౌడ్, శ్రవణ్ కుమార్ పటేల్, గంప రాజశేఖర్, గొల్లెన శేఖర్, ఓరుగంటి లత, లక్ష్మీ రెడ్డి, రాజు నాయక్, రాహుల్ సింగ్, రామకృష్ణ, శివశంకర్, పుల్లూరి అనిల్, మచ్చ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

### : తోటకూర వజ్రేష్ యాదవ్

**జవహర్ నగర్, నేడు న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తో కలిసి లబ్ధిదారుడు కాసోజు సోమాచారికి 60 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో లబ్ధి చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జవహర్ నగర్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దయాకర్ చారి, కాసోజు యాక చారి తదితరులు పాల్గొన్నారు.

# భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు

- పాక్ అభ్యర్ధన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం
- ట్రంప్‌తో మోదీ స్పష్టం



**న్యూఢిల్లీ :** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తామే ఆపామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పదేపదే చాటుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర చర్చే నడిచింది. ట్రంప్ ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేశాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా దీనిపై స్పందించారు. భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడికి స్పష్టంగా చెప్పినట్లు కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. "జీ7 శిఖరాగ్ర సదస్సు అనుబంధంగా ప్రధాని మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగాల్సి ఉంది. అయితే, అమెరికా అధ్యక్షుడు ముందుగానే వెళ్లిపోవడంతో వీరు సమావేశం కాలేకపోయారు. అనంతరం వీరిద్దరూ 35 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత ట్రంప్.. మోదీకి ఫోన్ చేసి సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామ న్నారు. ఆ తర్వాత నుంచి నుంచి వీరిద్దరూ మాట్లాడుకోవడం మళ్లీ ఇప్పుడే. కాబట్టి.. 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి వివరించారు" అని మిస్రీ తెలిపారు. "పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు. భారత్-పాకిస్థాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్-పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడు, ఎప్పుడూ.. భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించ బోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడికి మోదీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉంది" అని మిస్రీ వివరించారు. ఇక కెనడా నుంచి తిరిగివెళ్తుండగా అమెరికా రావాలని ట్రంప్.. మోదీని ఆహ్వానించినట్లు మిస్రీ తెలిపారు. అయితే, ముందస్తు షెడ్యూల్ కారణంగా తాను రాలేనని భారత ప్రధాని వివరించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ద్వైపాక్షికంగా భేటీ కావాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించినట్లు చెప్పారు. "భారత్‌లో జరిగే క్వాడ్ తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారు. దీన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్‌లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు" అని మిస్రీ వెల్లడించారు.

## రాయపోల్‌లో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం

### మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి



**నేడు న్యూస్, దుబ్బాక ప్రతినిధి :** రాయపోల్ కేజీబీవీ పాఠశాల మరియు కళాశాలలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం లోని రాయపోల్ కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. 2025 -2026 విద్యా సంవత్సరం నుంచి రాయపోల్ కేజీబీవీ విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎమ్మెల్టీ, ఎంపీహెచ్డబ్ల్యూ రెండు గ్రూపులలో తరగతులు ప్రారంభించడం జరుగుతుందని, ఈ గ్రూపులలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాయ-పోల్ మండలంలోని విద్యార్థులు గజ్వేల్, సిద్దిపేట, హైదరాబాద్ లాంటి పట్టణాలకు వెళ్లి విద్యను అభ్యసించవలసిన అవసరం లేకుండా రాయపోల్ మండల కేంద్రంలోనే బాలికలకు ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కోర్సులలో చేరిన విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను సక్రమంగా వింటూ క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేజీబీవీ విద్యాలయం సొంత భవనంలోకి మారుతుందని, అప్పుడు పూర్తిస్థాయిలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతుంది. కాబట్టి కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ సుగంధ లత, పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

## చదువే నేటి సమాజంలో విద్యార్థులకు మంచి గుర్తింపు


- భూంపల్లిలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ
- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**నేడు న్యూస్, దుబ్బాక ప్రతినిధి :** నేటి సమాజంలో చదువే విద్యార్థులకు మంచి గుర్తింపునిస్తుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలంలోని భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో మన ఊరు - మనబడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాలకు మంజూరైన డ్యూయల్ డెస్క్ లను ప్రారంభించి, ప్రభుత్వం విద్యార్థులకు అందించిన యూనిఫామ్స్ (ఏకరూప దుస్తులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి విద్య నుంచి మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులకు ఊరికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెరుమాండ్ల శ్రీనివాస్, బాలకృష్ణ,రాజేశ్వరి,ఇందిరా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్ పర్సన్ గౌతమి, తాజా మాజీ ఎంపిటిసి అబ్బుల ఉమారాణి బాల గౌడ్ పాల్గొన్నారు .

## పేదల ఇండ్లు కూలిస్తే సహించేది లేదు

### : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్




**జవహర్ నగర్, నేడు న్యూస్ :** పేదల ఇండ్లు కూల్చివేస్తే సహించేది లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఎస్ బోస్ హెచ్చరించారు. జవహర్ నగర్ లోని గిరి ప్రసాద్ నగర్ లో పేదల ఇల్లు కూల్చివేతకు నిరసనగా బుధవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాప్రా మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం పేద ప్రజలు గుడిసెలు వేసుకొని గిరి ప్రసాద్ నగర్ పేరుతో బస్తీని ఏర్పరచుకున్నారని అన్నారు. కాలక్రమేనా ఆ బస్తీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మంచినీటి నల్లాలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. 58 జీవో కింద పట్టాలు పొంది ఇల్ల నిర్మాణం చేసుకుంటే రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలు అంటూ కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, రాష్ట్ర నాయకులు సిహెచ్ దశరథ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సహదేవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి. జంగయ్య, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూప నాయక్, సిపిఐ కాప్రా మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎం. రాజేశ్వరి, గిరి ప్రసాద్ నగర్ సహాయ కార్యదర్శి కొండ సత్యం, మహిళా సమైక్య మండల అధ్యక్ష, కార్యదర్శులు కోదాసు జయమ్మ , కొత్తకోట కవిత, యాప్రాల్ శాఖ కార్యదర్శి వై. వెంకటేష్, పి. లక్ష్మణ్, సూర్యం, ఎల్లయ్య, మాధవి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మళ్లీ వాయిదా



**న్యూఢిల్లీ :** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. జూన్ 19న రోదసి యాత్ర ఉంటుందని తొలుత ఇస్రో తెలిపినప్పటికీ.. అది 22కు వాయిదా పడింది. ఇప్పటికే సాంకేతిక కారణాల తో యాక్సియం-4 ప్రయోగం పలుమా ర్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ మిషన్ కోసం ఉపయోగిస్తున్న ఫాల్కన్-9 రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు అధికారులు గుర్తించడంతో ఈనెల 11న జరగాల్సిన ప్రయోగాన్ని వాయిదా వేశారు. ఆ సమస్య పరిష్కారమైనట్లు తెలిపిన ఇస్రో.. 19న రోదసీ యాత్ర ఉంటుందని వెల్లడించింది. అయితే.. తాజాగా ఇది మరోసారి వాయిదా పడినట్లు ఇస్రో తెలిపింది. "ప్రయోగ తేదీపై ఇస్రో బృందం యాక్సియం స్పేస్‌తో సుదీర్ఘ చర్చల జరిపింది. ప్రయోగ సంసిద్ధతపై నాసా, స్పేస్ ఎక్స్‌తో యాక్సియం స్పేస్ సంప్రదింపులు జరిపింది. ఇటీవల చేపట్టిన మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జూన్ 22ను తదుపరి ప్రయోగ తేదీగా యాక్సియం స్పేస్ వెల్లడించింది" అని ఇస్రో తెలిపింది. యాక్సియం-4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు రోదసియాత్ర చేపట్టనున్నారు. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)లు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్-9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సిఉంది. అయితే, వాతావరణం అనుకూలించకపోవడం, సాంకేతిక సమస్య తలెత్తడం వంటి కారణాలతో పలుమార్లు వాయిదా పడుతోంది. ఇక, భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)తో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటిస్తారు.

## లొంగిపోయే ప్రసక్తే లేదు

### - ఇరాన్ సుప్రీం లీడర్



**ఇరాన్ :** తమపై దాడి చేసి ఇజ్రాయెల్ భారీ తప్పిదం చేసిందని, అందుకు శిక్ష తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల వేళ వీడియో సందేశం విడుదల చేసిన ఆయన.. ఇరాన్ లొంగిపోదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదిరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు. అంతేకాదు అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలన్నారు.

### విస్తృత యుద్ధమే..!

ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న పోరులో అమెరికా జోక్యం చేసుకుంటే అది పశ్చిమాసియాలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి కూడా హెచ్చరించారు. ఘర్షణల నేపథ్యంలో తొలిసారి స్పందించిన ఆయన.. తమపై దాడులకు దీటుగా స్పందిస్తామన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని.. ఆయన సురక్షితంగా ఉన్నారని చెప్పారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను చంపాలనుకోవడం లేదన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఖమేనీ ఈ విధంగా స్పందించారు.




## ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం

### వెనక్కి మళ్లిన ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ :** తూర్పు ఇండోనేసియాలోని లెవోటోబి లకి-లకి అగ్నిపర్వతం బద్దలవడంతో.. దానికి సమీపంలో బాలికి వెళ్లే ఎయిరిండియా విమానం వెనక్కి మళ్లింది. అక్కడి నుంచి తిరుగుపయనమైన విమానం బుధవారం దిల్లీకి సురక్షితంగా చేరుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో భారత్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి బాలికి వచ్చే పలు అంతర్జాతీయ విమానాలను రద్దు చేసినట్లు తెలిపారు. అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలోపెట్టుకొని.. తూర్పు ఇండోనేషియాలోని నుసా టెంగారా ప్రావిన్స్‌లోని విమానాశ్రయాన్ని మూసివేసినట్లు వెల్లడించారు. తూర్పు నుసా టెంగారా ప్రావిన్స్‌లోని లెవోటోబి లకి-లకి పర్వతం మంగళవారం విస్ఫోటనం చెందడంతో.. దాదాపు 11 కి.మీ. ఎత్తులో బూడిద ఎగసిపడినట్లు వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ (%ూఎవీదీ+%) అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం అగ్నిపర్వతంలో మళ్ళీ విస్ఫోటనం సంభవించడంతో 1 కి.మీ. ఎత్తులో దట్టమైన బూడిద ఎగసిపడుతున్నట్లు తెలిపారు. ఈ విస్ఫోటనం కారణంగా అగ్నిపర్వతం సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు స్థానిక విపత్తు నిర్వహణ సంస్థ అధికారి అవీ హల్లన్ తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చివరిసారిగా ఈ ఏడాది మేలో లకిలకి పర్వతం పలుమార్లు బద్దలయ్యిందని తెలిపారు.

### నిర్వహణ సమస్యలతో రద్దయిన మరో ఎయిరిండియా విమానం

విమానాల మళ్లింపులు, దిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు నిర్వహణ సమస్యలతో మంగళవారం ముంబయి నుంచి లఖ్‌నవూకు వెళ్లే ఎయిరిండియా విమానాన్ని రద్దు చేసినట్లు విమానయాన సంస్థ తెలిపింది. ప్రయాణికులకు ఎయిర్‌పోర్టులో బస ఏర్పాటుచేసి, బుధవారం వారిని తమ గమ్యస్థానాలకు చేర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తున్నట్లు పేర్కొంది.

# నన్ను పెళ్లి చేసుకుంటారా?



## అభిమానికి మాళవిక ఫన్నీ ఆన్సర్

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో చిట్‌చాట్ నిర్వహించే హీరోయిన్స్‌లో మాళవికా మోహనన్ ఒకరు. రెండు సినిమాల షూటింగ్ పూర్తి చేసిన ఆమె తాజాగా ఎక్స్ వేదికగా ఫ్యాన్స్‌ను పలకరించారు. ఈ క్రమంలోనే ఓ అభిమాని పెళ్లి గురించి అడగ్గా ఫన్నీ ఆన్సర్ ఇచ్చారు. 'నన్ను పెళ్లి చేసుకుంటారా?' అని సదరు అభిమాని సరదాగా ప్రశ్నించగా.. తనకు దెయ్యాలంటే భయమని మాళవిక రిప్లై ఇచ్చారు. అతడి ఎక్స్ ఖాతా పేరు 'ఘోస్ట్' అని ఉండడంతో ఆమె అలా సమాధానమిచ్చారు. మరికొన్ని విశేషాలివీ..

**'ది రాజాసాబ్'లో ప్రభాస్‌తో ఓ మాస్ సాంగ్ ఆశించొచ్చా?**

**మాళవిక:** తప్పకుండా.

**'ది రాజాసాబ్' ప్రమోషన్స్‌లో పాల్గొంటారా?**

**మాళవిక:** ప్రమోషన్స్‌కు హాజరవుతా.

**'హృదయపూర్వం'లో మోహన్‌లాల్‌తో కలిసి నటించడం ఎలా అనిపించింది?**

**మాళవిక:** మోహన్‌లాల్ సినిమాలు చూస్తూ పెరిగిన నేను.. ఆయనతోనే కలిసి నటించడం ఆనందంగా ఉంది.

**మీ లేటెస్ట్ మూవీస్?**

**మాళవిక:** ది రాజాసాబ్ (తెలుగు), సర్దార్ 2 (తమిళ్), హృదయపూర్వం (మలయాళం).

**ఏ దర్శకుడితో వర్క్ చేయాలని అనుకుంటున్నారు?**

**మాళవిక:** రాజమౌళి.

**మీకు బాగా నచ్చిన పుస్తకం?**

**మాళవిక:** అరుంధతీ రాయ్ రాసిన 'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'.

**రజనీకాంత్ 'పేట' గురించి చెబుతారా?**

**మాళవిక:** నా కెరీర్‌లో స్పెషల్ మూవీ.

**ఈ ఏడాది బర్త్‌డే ప్లాన్స్ ఏంటి?**

**మాళవిక:** నా పుట్టినరోజు (ఆగస్టు 4)ను గుర్తుచేసినందుకు థాంక్స్. ప్లానింగ్ త్వరలో చేస్తా.

**ఒక రోజు వేరే రంగం ఎంచుకోవాల్సి వస్తే.. దేన్ని ఇష్టపడతారు?**

**మాళవిక:** వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ.




# ది రాజాసాబ్ .. ఓ ఎమోషనల్ స్టోరీ

## చిత్రకథపై దర్శకుడు మారుతి

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది రాజాసాబ్' బిగ్గెస్ట్ హారర్ ఫాంటసీ ఫిల్మ్‌గా సిద్ధమవుతోంది. ఈ సినిమా కథను ఉద్దేశించి దర్శకుడు మారుతి జాతీయ మీడియాతో మాట్లాడారు. ఇదొక ఎమోషనల్ స్టోరీ అని చెప్పారు. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారన్నారు. ఇలాంటి కాన్సెప్ట్ ఇండియన్ స్క్రీన్స్‌పై ఇప్పటివరకూ రాలేదన్నారు. 'ఇదొక ఎమోషనల్ ఫిల్మ్. ఎన్నో భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. తాతయ్య, నానమ్మ, మనవడి కథను ఇందులో చూపించనున్నాం. స్క్రీన్‌పై చూసిన తర్వాత ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారు' అని మారుతి తెలిపారు. 'హవేలి రాజ్‌మహల్' సెట్, వీఎఫ్‌ఎక్స్ వర్క్‌ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'ప్రభాస్ చిత్రాలకు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, కథకు అనుగుణంగా భారీ సెట్స్ ఏర్పాటుచేశాం. వీఎఫ్‌ఎక్స్ విషయానికి వస్తే.. ప్రభాస్ సినిమాపై ప్రేక్షకుల్లో ఒక అంచనా ఉంటుంది. దానికి తగ్గట్టుగా వీఎఫ్‌ఎక్స్ వర్క్‌పై దృష్టిపెట్టాను. అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. నిర్మాణ సంస్థ కూడా బడ్జెట్ విషయంలో ఎక్కడా వెనుకాడలేదు. ప్రేక్షకులను మేము మోసం చేయాలనుకోవడం లేదు. వాస్తవికతకు వీఎఫ్‌ఎక్స్‌ను జోడించాలనేదే మా ఉద్దేశం. పూర్తిస్థాయిలో ఒక అబద్ధపు ప్రపంచాన్ని సృష్టించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు' అని ఆయన చెప్పారు. సినిమా కోసం ప్రభాస్ ఎంతో శ్రమించారన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన చిత్రాన్ని అందించేందుకు ఆయన అన్నివిధాలుగా కష్టపడుతుం టారని వివరించారు. డిసెంబర్ 5న పాన్‌ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదలైంది. ప్రభాస్ వింటేజ్ లుక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. సుమారు 3 గంటల నిడివితో ఇది విడుదల కానుందని టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో మారుతి తెలిపారు. 'రాజాసాబ్' కోసం నిర్మించిన హవేలి రాజ్‌మహల్ సెట్‌ను టీమ్ ఇప్పటికే మీడియాకు చూపించింది. దాదాపు రూ.7 కోట్లకు పైగా ఖర్చుతో ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ నిర్మించిన ఆ సెట్ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

# నాగచైతన్యతో కలిసి ప్రమోషన్స్.. సమంత క్లారిటీ



నటుడు నాగచైతన్య, నటి సమంత కలిసి వర్క్ చేసిన చిత్రం 'ఏ మాయ చేసావె'. సుమారు 15 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం వచ్చే నెల 18న రీ రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే 'ఏ మాయ చేసావె' రీ రిలీజ్ ప్రమోషన్స్‌లో సామ్-చై కలిసి పాల్గొననున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఆయా వార్తలపై సమంత స్పందించారు. అందులో ఎలాంటి నిజం లేదని ఆంగ్ల వెబ్‌సైట్‌తో ఆమె చెప్పారు. ఇలాంటి వార్తలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తున్నాయో తనకు తెలియడం లేదన్నారు. "చిత్రబృందానికి సంబంధించిన వ్యక్తులతో కలిసి నేను ఆ సినిమా ప్రమోట్ చేయడం లేదు. నిజం చెప్పాలంటే ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటున్నా. ఇలాంటి వార్తలు ఎవరు కల్పిస్తున్నారో నాకు తెలియడం లేదు. ఆ సినిమాకు ఉన్న అభిమానులు నటీనటులు కలిసి ప్రమోట్ చేస్తే చూడాలనుకుని ఉండొచ్చు. ఏది ఏమైనా ప్రేక్షకుల దృష్టి కోణంపై ఒకరి జీవితం ఆధారపడి ఉండదు" అని ఆమె చెప్పారు. అనంతరం షూటింగ్ రోజులను గుర్తు చేసుకున్నారు. "నిజం చెప్పాలంటే నేను షూటింగ్‌లో పాల్గొన్న తొలి చిత్రం 'మాస్కోవెన్ కావేరి'. అందులో నా స్నేహితుడు రాహుల్ రవీంద్రన్ హీరోగా నటించాడు. ఆ సినిమాకు సంబంధించిన విషయాలు నాకు పెద్దగా గుర్తు లేవు. ఎందుకంటే తొలిరోజు షూట్ అయిన వెంటనే చాలా రోజులపాటు విరామం ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడో మొదలుపెట్టారు. దానివల్ల సినిమా విశేషాలు పెద్దగా గుర్తులేవు. నా రెండో చిత్రం 'ఏ మాయ చేసావె'కు సంబంధించిన అన్ని విషయాలు నాకు గుర్తున్నాయి. జెస్సీ-కార్తిక్‌లపై చిత్రీకరించిన ఇంటి గేటు సీన్ నా తొలి షాట్. కెరీర్ ఆరంభంలోనే దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్‌తో కలిసి వర్క్ చేసినందుకు ఎంతో సంతోషంగా అనిపించింది" అని ఆమె తెలిపారు. సమంత ప్రస్తుతం నటిగానే కాకుండా నిర్మాతగానూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆమె నిర్మాతగా చేసిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'శుభం' ఇటీవల విడుదలై వినోదాన్ని పంచింది.




# విశ్వంభరలో సాంగ్ మ్యూజిక్ భీమ్స్‌కు అప్పగింత

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్నసినిమాలలో విశ్వంభర ఒకటి. బింబిసారా దర్శకుడు వసిష్ఠ మల్లిడి డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమా సోషియో ఫాంటాషి నేపథ్యంలో తెరకెక్కుతుంది. చిరు సరసన కోలీవుడ్ స్టార్ బ్యూటీ త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి స్పందన లభించింది. చాలా కాలంగా సెట్స్ పై ఉన్న విశ్వంభర ఎప్పుడో విడుదల కావాల్సి ఉంది. కానీ కొంత రీషూట్స్ మరికొంత రీ వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ ఎం ఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. విశ్వంభర ఫస్ట్ లిరికల్ 'రామ రామ' అనే సాంగ్ ను కూడా రిలీజ్ చేసారు. అయితే ఇప్పుడు ఈ సినిమా కోసం కీరవాణిని కాదని మరొక యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ వర్క్ చేయబోతున్నాడు. సంక్రాంతికి వస్తున్నాం, ధమాకా వంటి సూపర్ హిట్ ఆల్బమ్స్ ఇచ్చిన భీమ్స్ సిసిరోలియో విశ్వంభరకు సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాలో ఓ స్పెషల్ మాస్ సాంగ్ ను కంపోజ్ చేసే భాద్యతలు భీమ్స్ కు అప్పగించింది టీమ్. అందుకోసం వర్క్ కూడా స్టార్ట్ చేసాడు భీమ్స్. మిగిలిన సినిమా మొత్తం షూటింగ్ ఫినిష్ చేసారు. భీమ్స్ చేసే సాంగ్ షూట్ ఒక్కటే బ్యాలెన్స్ ఉంది. మరి చిరు కోసం భీమ్స్ ఎటువంటి సాంగ్ ఇస్తాడో చూడాలి.సోషియో ఫాంటాసి కథ నేపథ్యంలో సాగే ఈ సినిమా రిలీజ్ డేట్ ఎప్పుడు అనేది క్లారిటీ లేదు.

# జూలై 25కు కింగ్‌డమ్ లాక్ అయ్యిందా?

విజయ్ దేవరకొండ కెరీర్‌లో తెరకెక్కుతున్న అత్యంత కీలకమైన చిత్రం 'కింగ్‌డమ్'. తాజా సమాచారం ప్రకారం, 'కింగ్‌డమ్' సినిమా జూలై 25న, శుక్రవారం విడుదల కానుందని ఓ వార్త వైరల్ అవుతుంది. అధికారికంగా ఈ విషయంపై మేకర్స్ ప్రకటించనప్పటికీ, ఆ డేట్‌కే సినిమాను ప్లాన్ చేశారని ప్రచారం సాగుతోంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. గతంలో లైగర్, ఫ్యామిలీ స్టార్ వంటి ఫ్లాప్స్ కారణంగా.. విజయ్ మార్కెట్ మీద చాలా ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో 'కింగ్‌డమ్' ద్వారా తన కెరీర్‌ను మళ్లీ పైకి తీసుకెళ్లాలన్న నమ్మకంతో విజయ్ అడుగులు వేస్తున్నాడు. ఇక ఈ చిత్రానికి జెర్సీ వంటి హిట్‌ను అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు.విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే ఇది అత్యధిక బ్జడెట్ కలిగిన పాన్ ఇండియా చిత్రం. ఇక ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజయ్ లుక్ అన్నీ కలిసి సినిమాపై పాజిటివ్ బజ్ తెచ్చాయి. అయితే, టీజర్ తర్వాత ఎలాంటి ప్రమోషనల్ మెటీరియల్ విడుదల కాలేదు. పాటలు, ట్రైలర్ లేదా మీడియా ఈవెంట్లపై ఎటువంటి అప్‌డేట్లు లేకపోవడం కొన్ని అనుమానాలు మొదలయ్యాయి. సాధారణంగా ఇలాంటి భారీ చిత్రాలు విడుదలకు రెండు నెలల ముందే సాంగ్స్, ఈవెంట్లు మొదలవుతాయి. కానీ 'కింగ్‌డమ్' మేకర్స్ ఇప్పటికీ ప్రమోషనల్ కార్యక్రమాలపై మౌనమే పాటిస్తున్నారు. ఫ్యాన్స్ మాత్రం చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన కోసం ఆతురతగా ఎదురుచూస్తున్నారు. తన కెరీర్‌ను మళ్లీ నిలబెట్టుకోవాలనుకునే విజయ్ దేవరకొండకు ఈ సినిమా ఎంతో ముఖ్యం. మరి ఏం జరుగుతుందో చూడాలి.



## హీరో ఆర్య నివాసంలో ఐటీ సోదాలు

చెన్నై: కోలీవుడ్ నటుడు ఆర్య నివాసంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం సోదాలు నిర్వహిస్తున్నారు. అన్నానగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆయనకు చెందిన సీ షెల్ రెస్టరంట్లపై కూడా అధికారులు దాడులు చేస్తున్నారు. పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలోనే అధికారులు ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, ఈ దాడులను ఉద్దేశించి ఆర్య స్పందించారు. సీ షెల్ రెస్టరంట్లతో తనకు సంబంధం లేదని ఆయన స్థానిక మీడియాతో చెప్పారు. ఈ హోటళ్ల నిర్వహణ బాధ్యతను ఆయన కొన్నేళ్లక్రితమే మరో వ్యక్తికి అప్పగించినట్లు తెలుస్తోంది.



## భారత్ తుది జట్టును ఎంపిక చేసిన మాజీ బ్యాటర్..

### నితీశ్, అర్ష్‌దీప్‌లకు నో ఛాన్స్



ఇంగ్లాండ్, భారత్ మధ్య ఐదు టెస్టుల సమరానికి సమయం ఆసన్నమవుతోంది. జూన్ 20న ప్రారంభంకానున్న ఈ సిరీస్‌తోనే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-2027 ప్రారంభం కానుంది. లీడ్స్ వేదికగా జరగనున్న మొదటి టెస్టుకు కోసం ఇరుజట్లు నెట్స్‌లో సాధన చేస్తున్నాయి. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో తుది జట్టు ఎలా ఉండనుంది అనే దానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత మాజీ బ్యాటర్ వసీమ్ జాఫర్ తన అంచనా ప్రకారం తొలి టెస్టు కోసం టీమ్ఇండియా తుది జట్టును ఎంపిక చేస్తూ ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేశాడు. భారత్ ప్లేయింగ్ ఎలెవన్‌లో నితీశ్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్‌కు వసీమ్ అవకాశం కల్పించలేదు. భారత ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లను జాఫర్ ఎంపిక చేశాడు. మూడో స్థానంలో అభిమన్యు ఈశ్వరన్ లేదా సాయి సుదర్శన్‌కు అవకాశం దక్కొచ్చని అంచనా వేశాడు. దేశవాళీ క్రికెట్‌లో అభిమన్యు, ఐపీఎల్ 2025లో అదరగొట్టిన సాయి సుదర్శన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. జాఫర్ ఎంపిక చేసిన భారత్ తుది జట్టులో నాలుగో స్థానంలో శుభ్‌మన్ గిల్, ఐదో స్థానంలో రిషభ్ పంత్ ఉన్నారు. వసీమ్ తర్వాతి రెండు స్థానాల్లో కరుణ్ నాయర్, రవీంద్ర జడేజాలను తీసుకున్నాడు. ఎనిమిదో స్థానంలో పేసర్ శార్దూల్ ఠాకూర్, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌లలో ఒకరు చోటు దక్కించుకుంటారని అభిప్రాయపడ్డాడు. వసీమ్ చివరి మూడు స్థానాలకు ప్రసిద్ధ్ కృష్ణ, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లను ఎంపిక చేశాడు. దీనికి నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కొంతమంది జట్టు ఎంపిక బాగుందని పేర్కొంటుండగా.. మరికొందరు బాగోలేదని కామెంట్లు చేస్తున్నారు. శార్దూల్‌కు బదులు అంశుల్ కాంబోజ్, ప్రసిద్ధ్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌ను ఎంపిక చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు.

#### భారత జట్టులోకి హర్షిత్ రాణా

ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు కోసం హర్షిత్ రాణాను టీమ్ఇండియాలోకి తీసుకున్నారు. ఈ మేరకు బీసీసీఐ అధికారికంగా ప్రకటన చేసింది. భారత్-ఎ జట్టులో ఉన్న పేసర్ హర్షిత్ రాణా టీమ్ఇండియాతో కలిశాడు. దీంతో జట్టులో ప్రధాన బౌలర్ల సంఖ్య 6కి చేరింది.

# ఇంగ్లాండ్-భారత్ సిరీస్

## మొదటి టెస్ట్ మ్యాచ్ పిచ్ ఎలా ఉందంటే?

ఇంగ్లాండ్, టీమ్ఇండియా మధ్య జూన్ 20 నుంచి అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. తొలిపోరు లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరగనుంది. ఈ నేపథ్యంలో అక్కడ పిచ్ ఎలా ఉండనుందో.. లీడ్స్ గ్రౌండ్స్ హెడ్ రిచర్డ్ రాబిన్సన్ వివరించే ప్రయత్నం చేశాడు. 'ఇక్కడ అసాధారణంగా పొడి వాతావరణం వల్ల మంచి సర్ఫేస్ ఉన్న పిచ్ ఉండొచ్చు. ఇంగ్లాండ్ టీమ్ కూడా ఇలాంటి ఉపరితలం ఉండే పిచ్‌నే కోరుకుంటోంది. తొలి రోజున పిచ్ ఫాస్ట్ బౌలర్లకు సహాయపడుతుంది. ఈ తర్వాత వేడి కారణంగా క్రమంగా ఫ్లాట్‌గా మారొచ్చు. ఇంగ్లాండ్ బజ్‌బాల్ క్రికెట్‌కు సరిపోవడమే కాకుండా.. అంతగా అనుభవం లేని టీమ్ఇండియా బ్యాటింగ్ లైనప్‌కు పరీక్ష పెట్టొచ్చు' అని పేర్కొన్నాడు. గతంలో ఎప్పుడైనా సరే ఈ మైదానంలో టెస్ట్ సిరీస్ మధ్యలోని మ్యాచ్‌లను నిర్వహించేవారు. కానీ ఈ సారి మొదటి మ్యాచ్‌తో సిరీస్ ఇక్కడే ప్రారంభం కాబోతోంది. దీంతో ఈ అంశం క్రికెట్ అభిమానులు, విశ్లేషకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తమ రిటైర్మెంట్లను ప్రకటించిన తర్వాత శుభ్‌మన్ గిల్ టీమ్ఇండియా నూతన టెస్ట్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రో-కో ద్వయం నిష్క్రమణతో ప్రస్తుతం రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ సీనియర్ ఆటగాళ్లుగా ఉన్నారు. అలాగే ఇంగ్లండ్‌లో మొదటి సారి క్రికెట్ ఆడనున్న యశస్వి జైస్వాల్, 2017లో చివరిసారిగా టెస్ట్ మ్యాచ్ ఆడిన కరుణ్ నాయర్ జట్టులో ఉన్నారు. ఇదిలా ఉండగా సోమవారమే భారత్ లీడ్స్‌కు చేరుకుంది. ఇంగ్లాండ్ జట్టు హెడింగ్లీలో శిక్షణ సెషన్ నిర్వహించింది. అయితే గత రెండు దశాబ్దాలుగా భారత్ ఇక్కడ పెద్దగా ఆడలేదు. ఈ నేపథ్యంలో తొలి టెస్టులో టీమ్ఇండియా ఏమేరకు రాణిస్తుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# వాహనదారులకు గుడ్‌న్యూస్

## ఫాస్టాగ్ వార్షిక పాస్ ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై ప్రయాణం విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15 నుంచి ఈ యాన్యువల్ పాస్ అందుబాటులోకి రానుంది. రూ.3 వేలు చెల్లించి ఈ పాస్ తీసుకోవాల్సి ఉంటుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యాక్టివేట్ చేసిన పాస్‌లు ఏడాదిపాటు లేదా 200 ట్రిప్పులు (ఏది ముందైతే అది) చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. కార్లు, జీపులు, వ్యాన్లు వంటి నాన్-కమర్షియల్ ప్రైవేటు వాహనాలకు ఇది వర్తిస్తుందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై ఇది పనిచేస్తుందని నితిన్ గడ్కరీ తెలిపారు. దీని యాక్టివేషన్ కోసం త్వరలోనే ఓ లింక్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. రాజ్‌మార్గ్ యాప్‌తో పాటు వెబ్‌సైట్లలో ఈ లింక్ అందుబాటులోకి వస్తుందన్నారు. వార్షిక పాస్ తీసుకురావాలన్న ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ పాస్‌ను తీసుకొస్తున్నట్లు తెలిపారు. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని, వివాదాలు తగ్గించేందుకు ఇది ఉపకరిస్తుందని పేర్కొన్నారు. లక్షలాది మంది ప్రైవేటు వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని గడ్కరీ అన్నారు.





#### ఒక్కో ట్రిప్‌నకు రూ.15 మాత్రమే!

వార్షిక పాస్ వల్ల ఒక్కో ట్రిప్‌నకు అయ్యే సగటు ఖర్చు రూ.15 మాత్రమేనని గడ్కరీ వెల్లడించారు. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్న వారు కొత్తగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టతనిచ్చారు. అలాగే ప్రతి ఒక్కరూ వార్షిక పాస్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కమర్షియల్ వాహనదారులు ఎవరైనా పాస్ తీసుకొనేందుకు ప్రయత్నిస్తే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే డీయాక్టివేట్ చేస్తామని కేంద్రం హెచ్చరించింది. జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై ఉండే టోల్‌ప్లాజాలకు మాత్రమే పనిచేస్తుందని కేంద్రం పేర్కొంది.

#### ట్రిప్పు అంటే..?

నితిన్ గడ్కరీ ఫాస్టాగ్ పాస్ గురించి ప్రకటించగానే చాలా మందిలో ఓ సందేహం తలెత్తింది. ఒకసారి పాస్ తీసుకుంటే గరిష్ఠంగా 200 ట్రిప్పులు వినియోగించుకోవచ్చని గడ్కరీ పేర్కొన్నారు. ఇక్కడ 'ట్రిప్' నిర్వచనం గురించి చాలా మందిలో సందేహం నెలకొంది. దీనిపై కేంద్రం వివరణ ఇచ్చింది. ఒక్కో టోల్‌ప్లాజాను దాటడాన్ని ఒక్కో ట్రిప్‌గా పేర్కొంటారు. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి విజయవాడ ప్రయాణించేటప్పుడు మధ్యలో నాలుగు టోల్‌గేట్లు దాటాల్సి ఉంటుంది. అంటే హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లొస్తే ఎనిమిది ట్రిప్పులుగా పరిగణిస్తారు. ఆ లెక్కన పాస్ తీసుకుంటే ప్రతి టోల్ గేటు వద్ద సగటున రూ.15 చొప్పున చెల్లించినట్లు అవుతుంది.

## మెటా ఊరించినా మాకు ఎవరూ టాటా చెప్పలేదు : శామ్ ఆల్ట్‌మన్



ప్రముఖ టెక్ సంస్థ మెటాపై ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్‌ఆల్ట్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ సంస్థలోని ఏఐ నిపుణులను ఆకర్షించేందుకు మెటా భారీ ఆఫర్లు ప్రకటించిందన్నారు. అత్యధిక వార్షిక ప్యాకేజీతో పాటు, 100 మిలియన్ డాలర్ల వరకు సైన్-ఆన్ బోనస్‌లను ఆశజూపినట్లు తెలిపారు. తాజాగా తన సోదరుడు జాక్ ఆల్ట్‌మన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెటా తమను పోటీదారుగా భావిస్తోందని శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. అందుకే నిపుణులైన ఇంజినీర్లను ఆకర్షించడానికి 100 మిలియన్ డాలర్లు (సుమారు రూ.864 కోట్లు) ఇచ్చేందుకు సిద్ధమైందని వెల్లడించారు. అయితే తమ సంస్థ ప్రత్యేక ప్యాకేజీలు అందిస్తోందని తెలిపారు. దీంతో ఒక్క ఉద్యోగి కూడా మెటా ఆఫర్‌ను స్వీకరించలేదని వివరించారు. భారీ వేతనంతో ఉద్యోగులను ఆకర్షించే మెటా వ్యూహం దీర్ఘకాలికంగా కొనసాగలేదని, డబ్బు మాత్రమే ఏఐ రేసులో విజయాన్ని తెచ్చిపెట్టదన్నారు. మెటా తన ఏఐ లక్ష్యాలను సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. ఇటీవల స్కేల్ ఏఐ మాజీ సీఈఓ అలెగ్జాండర్ వాంగ్ నేతృత్వంలో 'సూపర్ ఇంటెలిజెన్స్' బృందాన్ని ఏర్పాటు చేసింది. అంతే కాదు ఏఐ కోసం 14 బిలియన్ డాలర్లపైగా పెట్టుబడి పెట్టింది. మరోవైపు.. ఓపెన్‌ఏఐ, గూగుల్‌డీప్‌మైండ్ నుంచి ప్రతిభావంతుల్ని ఆకర్షించేందుకు మెటా అత్యధిక వేతన ఆఫర్లను అందిస్తోందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

Suraksha
DIAGNOSTICS FOR YOU

## సురక్ష డయాగ్నోస్టిక్స్ రూ.200 కోట్ల పెట్టుబడి

'సురక్ష డయాగ్నోస్టిక్స్' గణనీయమైన విస్తరణను ప్లాన్ చేస్తోంది. ఈ సంస్థ తూర్పు భారతదేశం అంతటా కీలకమైన ప్రాంతాల్లో అధునాతన ఇమేజింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి రూ. 200 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఈరోజు (బుధవారం) తెలిపింది. ఈ పెట్టుబడి ద్వారా 20కు పైగా అధునాతన ఇమేజింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈ కేంద్రాలు తూర్పు భారత దేశం అంతటా ఉండేలా ప్లాన్ చేస్తోంది. అత్యాధునిక ఇమేజింగ్ సొల్యూషన్లను అందించే యునైటెడ్ ఇమేజింగ్ సహకారంతో అమలు చేయబోయే ఈ ప్రణాళిక ద్వారా డయాగ్నస్టిక్ సేవలను టైర్ 2, టైర్ 3 ప్రాంతాల్లో మరింత మెరుగుపర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల చిన్న పట్టణాలు, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణను మెరుగుపర్చాలనుకుంటున్నట్లు సురక్ష డయాగ్నస్టిక్స్, సోమనాథ్ చటర్జీ తెలిపారు. సురక్ష డయాగ్నస్టిక్స్ దాని విస్తరణ ప్రణాళికలకు నిధులు సమకూర్చడానికి గత డిసెంబర్‌లో ద్వారా రూ. 846.25 కోట్లు సేకరించింది. ప్రస్తుతం, ఇది పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సాం, మేఘాలయ అంతటా 59 డయాగ్నస్టిక్ కేంద్రాలు, 166 నమూనా సేకరణ కేంద్రాలను నిర్వహిస్తోంది.

# మహిళా టెకీలూ.. మీపై నమ్మకం ఉంచండి

### అపుడే నాయకత్వ స్థానాలకు వెళతారు గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లొబానా



**ఢిల్లీ:** టెక్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళలు, నాయకత్వ హోదానే లక్ష్యంగా పెట్టుకోవాలని గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ ప్రీతి లొబానా పేర్కొన్నారు. 'మీ లక్ష్యాలపై స్పష్టత ఉంచుకోండి. అందుకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకోండి. మెంటార్లు, ఇతరుల సహాయం కోరండి. మీపై, మీ సామర్థ్యాలపై మీరు నమ్మకం ఉంచుకోండి' అని సూచించారు. ఐటీ రంగంలో భారత్‌లో 58 లక్షల మంది పనిచేస్తుండగా, అందులో 36% మంది మహిళలే. ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో దాదాపు 40% వరకు వారే ఉన్నారు. అయితే నాయకత్వ స్థానాల్లో మాత్రం మహిళలు 5% మందే ఉన్నారని పరిశ్రమ సంఘం నాస్కామ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 'మిమ్మల్ని వెనక్కి లాగే మీలోని అనుమానాల స్వరాన్ని వినకండి. నేను ఇది చేయగలనా? అంత సామర్థ్యం నాలో ఉందా? అన్న అనుమానాలను రానివ్వకండి. మీ సామర్థ్యాన్ని నిర్భయంగా వినియోగించుకోండి. ఎప్పటికపుడు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకుంటూనే ఉండండ'ని మహిళా టెకీలకు ప్రీతి సూచించారు. 'నా ప్రయాణంలో చాలా మంది కీలక పాత్ర పోషించారు. మెంటార్లు, స్పాన్సర్లతో పాటు ఇంట్లోనూ నాకు మద్దతు లభించింది. అయితే నాకొచ్చిన అనుమానాలను కానీ, నాపై ఇతరులకొచ్చిన అనుమానాలను కానీ నేను పట్టించుకోలేదు' అని ప్రీతి వివరించారు.

#### ఆన్‌లైన్ మోసాల అడ్డుకట్టకు గూగుల్ చర్యలు

దిల్లీ: ఆన్‌లైన్ మోసాలు, తప్పుదారి పట్టించే కంటెంట్‌ను అరికట్టడంతో పాటు సైబర్ భద్రతను పెంచడం, బాధ్యతాయుత ఏఐ (కృత్రిమమేధ) అభివృద్ధికి చేయూతనివ్వడం కోసం గూగుల్ మంగళవారం 'సేఫ్టీ చార్టర్ ఫర్ ఇండియా'ను ఆవిష్కరించింది. ఆన్‌లైన్ ప్రపంచంలో ఎదురవుతున్న కొత్త సవాళ్లను పరిష్కరించడానికి మార్గసూచీయే ఈ చార్టర్. ఆన్‌లైన్ మోసాలు, స్కామ్‌ల నుంచి వినియోగదార్లను రక్షించడమే దీని ఉద్దేశం. ప్రభుత్వం, కంపెనీలకు చెందిన మౌలిక వసతులకు సైబర్ భద్రతనూ కల్పిస్తుంది. ఏఐని బాధ్యతాయుతంగా నిర్మిస్తుంది.

**ప్రాధాన్యత ఎందుకంటే:** ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు భారీగా పెరిగాయి. స్కామర్లు ఏఐ ఆధారిత కంటెంట్, డీప్‌ఫేక్ వీడియోలు, వాయిస్ క్లోనింగ్ ద్వారా మోసాలు చేస్తున్నారు. 2024లో యూపీఐ సంబంధిత మోసాల్లో భారతీయులు రూ.1,087 కోట్లు పోగొట్టుకున్నారు. ఒక వేళ సైబర్ భద్రతా చర్యలు తీసుకోకుంటే 2025లో భారత కంపెనీలు రూ.20,000 కోట్ల వరకు కోల్పోవచ్చని గూగుల్ అంచనా వేసింది. గూగుల్ మెసేజస్ నెలవారీగా 50 కోట్లకు పైగా స్కామ్ మెసేజ్‌లను అడ్డుకుంటోంది. 250 కోట్ల అనుమానిత లింక్‌లపై ఆన్-డివైజ్ ఏఐ ద్వారా హెచ్చరికలు చేసింది.

#### ఆన్‌లైన్ భద్రతకు గూగుల్ సూచనలు

- ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ఉండడానికి గూగుల్‌కు చెందిన సైబర్‌సెక్యూరిటీ ప్రొ కొన్ని సూచనలు చేసింది.
- బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోండి. సాధ్యమైన చోట వన్-టైం పాస్‌వర్డ్ వచ్చేలా మార్పు చేసుకోండి.
- మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర పరికరాల సాఫ్ట్‌వేర్ క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయండి.
- మీ స్నేహితుల నుంచి వచ్చిన మెసేజ్ అనుమానాస్పదంగా/కొత్తగా అనిపిస్తే వెంటనే సంబంధితులను నేరుగా కలిసి/వారి నంబరుకు ఫోన్ చేసి మాట్లాడాలి. నిజంగా వారే ఆ సందేశం పంపించారో లేదో తెలుసుకోవాలి.



## కొనసాగిన యుద్ధ భయాలు..

### 24,850 దిగువకు నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఫైనాన్షియల్, ఆటో స్టాక్స్ రాణించడం సూచీలకు కొంతమేర కలిసొచ్చింది. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయం ఈ రాత్రికి వెలువనుండడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ ఉదయం 81,314.62 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,583.30) నష్టాల్లో ప్రారంభమైంది. తర్వాత లాభాల్లోకి వచ్చినప్పటికీ ఎంతోసేపు నిలవలేదు. ఇంట్రాడేలో 81,237.01-81,858.97 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 138 పాయింట్ల నష్టంతో 81,444.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 41 పాయింట్లు కోల్పోయి 24,812.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.48గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3397 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com